
రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమ) సా. 6.26
సహరి(మంగళ) ఉ. 4.28


ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	45.0	24.0

10న నిడదవోలులో చంద్రబాబు, పవన్ రోడ్‌షో

తొలిసారి జిల్లాలో ఉమ్మడిగా పర్యటన





రాజమహేంద్రవరం, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉమ్మడిగా రోడ్ షో నిర్వహించనున్నారు. ఇప్పటి వరకూ ఒకే వేదికపై ఇద్దరూ కనిపించారు. రోడ్‌షో మాత్రం ఇప్పటి వరకూ నిర్వహించలేదు. తూర్పుగోదావరి జిల్లాలో తొలిసారి ఒకే వేదికపై చంద్రబాబు, పవన్ కనిపించనున్నారు. నిడదవోలులో ఈ నెల 10న రోడ్ షో, బహిరంగ సభ నిర్వహించనున్నారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు తణుకులో రోడ్ షో నిర్వహిస్తారు. అనంతరం రోడ్ మార్గాన సాయంత్రం ఏడు గంటలకు నిడదవోలులో రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో నిడదవోలు కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్,టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఏర్పాట్లు చేస్తున్నారు.11వ తేదీన పి.గన్నవరం, అమలాపురం నియోజకవర్గాల్లో ఉమ్మడిగా రోడ్‌షో,సభ ఉంటుందని సమాచారం.

తవ్వారు.. వదిలేశారు..!

- రాజమహేంద్రవరంలో రోడ్లు మిల్లింగ్
- నరకం చూస్తున్న జనం
- ఛిద్రంగా మారిన నగర వీధులు
- తారు కొరత...డబ్బులేదా?

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో అధికార వైసీపీ ప్రజలకు నరకం చూపిస్తోంది. ఐదేళ్ల పాటు కనీసం రోడ్లను పట్టించుకోని నగరపాలక సంస్థ ఎన్నికల ముందు ఆదరా బాదరాగా సీసీ రోడ్లు వేస్తామని చెప్పి చాలా రోడ్లను మిల్లింగ్ చేసింది. అంటే పైభాగం గోకేసి వదిలేసింది. దీంతో ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రోడ్లు నిర్మించే ముందు ఎప్పటి పని అప్పుడే చేసేవారు. ప్రస్తుతం నెలల తరబడి రోడ్లను తవ్వేసి వదిలేశారు. తారు కొరత ఏర్పడిందని చెబుతున్నారు. దానవాయిపేటలోని ప్రధాన రోడ్డు తవ్వేసి చాలా రోజులైంది. ఇటీవల ఒక మూల నుంచి సీసీ రోడ్డు మొదలు పెట్టారు. కానీ ఈ రోడ్డును చూస్తుంటే రాజమహేంద్రవరమేనా, అందులోనూ దానవాయిపేట ప్రధాన రోడ్డేనా అనిపిస్తోంది. ఏవీ అప్పారావు రోడ్డును కిలోమీటర్ల మేర తవ్వేసి చాలా రోజులైంది.దానిని ఎవరూ పట్టించుకోవడంలేదు. స్వతంత్ర ఆసుపత్రి సమీపంలోని వాంబేగృహాల రోడ్డు మరీ అధ్వానం. ఎన్నికల ముందు రోడ్లు వేసి ప్రజల మన్నన పొందాలనే వైసీపీ ఆతృత కారణంగా ప్రజలు నరకం అనుభవిస్తున్నా రు. మునిసిపల్ అధికారుల ఈ రోడ్ల గురించి పూర్తిగా చెప్పడానికి ఇబ్బంది పడుతున్నారు. ఎందుకంటే చాలా రోడ్లు నిధులు లేకుండానే తవ్వేశారు. కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో పనులు ఆపేశారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల ప్రభుత్వం పాత బకాయిలు రూ.18 కోట్లు రిలీజ్ చేసినట్టు చెబుతున్నారు. అవి తీసుకున్నా ప్రస్తుత రోడ్లకు కాంట్రాక్టర్లు పెట్టుబడులు పెట్టవలసి ఉంది. మార్చి 31వతేదీ దాటడం, కొత్త ఆర్థిక సంవత్సరం ఆరంభమవడంతో పనులు ఏ మేరకు ఈ ఎన్నికల సమయంలో పూర్తవుతాయోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తవ్వకపోయినా బాగుండేది. ఏకంగా తవ్వి వదిలేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.





రాజమహేంద్రవరం దానవాయిపేటలో ఒక రోడ్డు

15న ఎన్నికల విధులపై శిక్షణ

జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 7 : జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులందరికి ఈ నెల 15న నియోజకవర్గాల వారీగా శిక్షణ ఇస్తామని జిల్లా ఎన్నికల అధికారిణి డాక్టర్ కే.మాధవీలత తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు ఉత్తర్వులతో పాటు ముందస్తుగా ఫారం 12 జారీచేసినట్లు తెలిపారు. ఫారం 12లో తప్పులు సరిదిద్దేందుకు నమూనా ఫారం 12 ఆయా శాఖల హెచ్‌వోడీలకి /డీడీవోలకి పంపడం జరిగిందన్నారు. వీటిని ఎన్నికల కమిషన్ వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. 15న జరిగే శిక్షణలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు. ఫేసిలిటేషన్ సెంటర్‌లో 10 టేబుల్స్ ఏర్పాటు చేసి డేటా ఎంట్రీ ఆపరేటర్లను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. వారి వద్దకు మీ డ్యూటీ ఉత్తర్వులు ఫారం 12, ఎపిక్ కార్డు తీసుకుని వెళ్లి మీ ఓటు నిర్ధారణ చేసుకోవాలని తెలిపారు. ఓటర్లకు తమ ఓటు ఉందా ? లేదా ? ఉంటే ఏ పోలీంగ్ స్టేషన్‌లో ఉంది, ఎక్కడ ఉంది అనే సమాచారంతో పాటు బూత్ లెవెల్ అధికారి ఎవరు ఫొటోగుర్తింపు కార్డు అవసరమైన సమాచారం పబ్లిక్ పోర్టల్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



9 అంశాలతో మేనిఫెస్టో పోస్టర్ విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆ రెండు టిక్కెట్లు మార్చండి

- కొవ్వూరు, అనపర్తి అభ్యర్థులను మార్చాలని డిమాండ్
- జిల్లా కాంగ్రెస్ సమావేశంలో నిలదీసిన నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 7 : కాంగ్రెస్ పార్టీలో విభేదాలు రచ్చకెక్కాయి. రాజమహేంద్రవరం ఆనంద్ రీజెన్సీలో జిల్లా పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల మండల కన్వీనర్లు ,ముఖ్యనాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు.ఏఐసీసీ రాష్ట్ర పరిశీలకుడు మనోజ్ చౌహాన్, ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు దిశా నిర్దేశం చేశారు. అనంతరం పోటీ చేస్తున్న అభ్యర్థులతో కలిసి 9 గ్యారెంటీల పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో కొవ్వూరు నియోజకవర్గానికి చెందిన నాయకులు జె.రవికుమార్, భాస్కర్, మట్టా సుబ్బారావు, కొడమంచిలి చంద్రశేఖర్ కొవ్వూరు అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేశారు. నేతలతో వాగ్వాదానికి దిగారు. కార్యకర్తలకు అందుబాటులో లేకుండా కేవలం ఎన్నికల్లో మాత్రమే వచ్చే వారికి సీటు ఎలా కేటాయిస్తారని నిలదీశారు. పార్టీ జెండా పట్టుకుని ప్రతి కార్యక్రమంలో కష్టపడి పనిచేసిన వారిని పక్కనపెట్టడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అనపర్తి నియోజకవర్గానికి చెందిన రాజారెడ్డి తాను పార్టీ కోసం కష్టపడ్డానని.. అనపర్తి నియోజకవర్గాన్ని అన్ని పార్టీలు రెడ్లకు కేటాయిస్తే కాంగ్రెస్ మాత్రం తనకు అన్యాయం చేసిందని అభ్యర్థిని మార్పుచేయాలని డిమాండ్ చేశారు. సీతానగరం గ్రామానికి చెందిన సూర్యకుమారి తాను పార్టీ కోసం కష్టపడ్డానని ఒక ఓసీ మహిళకు సీటు కేటాయించలేకపోయారని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో సమావేశంలో గందరగోళం నెలకొంది. గిడుగు రుద్రరాజు వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయితే వారిలో కొందరు అక్కడ నుంచి వెళ్లిపోయారు. మరికొందరు నాయకులు చెప్పే మాటలు విని శాంతించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లు సుంకర పద్మశ్రీ, జంగా గౌతమ్, అసెంబ్లీ అభ్యర్థులు బోడా వెంకట్, బాలేపల్లి మురళీధర్,డాక్టర్ యర్ల శ్రీనివాసరావు, ఎం.వెంకటశ్రీనివాస్, అరిగెల అరుణకుమారి, పెదిరెడ్డి సుబ్బారావు, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ముళ్ళ మాధవ్, ఆకుల సూర్యభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఓటు పాఠం చెబుతాం వినండి..

కడియంలో డీఈవో, టీచర్ల అవగాహన ర్యాలీ

కడియం, ఏప్రిల్ 7: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు పిలుపునిచ్చారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం కడియం ఎంఆర్‌సీ నుంచి దేవీచౌక్ సెంటర్ వరకు ఓటర్ల అవగాహన ర్యాలీ చేశారు. ఓటు పాఠం చెబుతాం వినండి అంటూ నినాదాలు చేశారు. బొబ్బిలిబ్రిడ్జి సెంటర్‌లో మానవహారం నిర్వహించి ఓటు విలువ తెలిపారు.డీఈవో వాసుదేవరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం అన్నారు.ఓటు ద్వారా ప్రజాస్వామ్యం బలపడుతుందన్నారు. కడియం ఎంఈవో-1,2 మణికుమార్, వై.నాగేశ్వరరావు, హెచ్‌ఎం టి.సత్యనారాయణ, ఈవీఎస్ఆర్ ప్రసాద్, విశ్వనాథం, యూటీఎఫ్,ఎస్టీయూ నాయకులు అబ్బాయి,ఆనందవిజయకుమార్, వల్లూరి శ్రీనివాసరావు, టీవీఎస్ ప్రసాద్,సబ్బితి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగదుకు పత్రం అందజేస్తున్న సిబ్బంది

రూ.3.36 లక్షల నగదు స్వాధీనం

రంగంపేట, ఏప్రిల్ 7 : రామేశంపేట చెక్‌పోస్టు వద్ద సరియైన ఆధారాలు లేని నగదు స్వాధీనం చేసుకున్నారు. రామేశంపేట చెక్‌పోస్టు వద్ద ఆదివారం మధ్యాహ్నం 12.40 గంటలకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ వాహన తనిఖీలు చేస్తున్నారు. కాకినాడ నుంచి రాజమహేంద్రవరం వైపునకు వెళుతున్న ఇన్నోవా వాహనంలో తనిఖీ చేయగా ఆధారాలు లేని రూ. 3,36,500ల నగదు లభ్యమైంది. ఈ మేరకు సొమ్మును స్వాధీనం చేసుకున్నట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ పి.వెంకటరత్నం తెలిపారు. రంగంపేట ఎస్ఐ ద్వారా జిల్లా ఎన్నికల గ్రీవెన్స్‌సెల్‌కు తరలించడానికి చర్యలు తీసుకున్నామన్నారు.తనిఖీల్లో చెక్‌పోస్టు సిబ్బంది కె.వీర్రాజు,కె.ఆదినారాయణ, జి.వెంకటలక్ష్మి, ఫ్లయింగ్‌స్క్వాడ్ జీవీఎస్ఎస్ రెడ్డి,వీఆర్వో దొరబాబు పాల్గొన్నారు.

ఓటు రూటు..

నిండు వేసవిలో వేడెక్కిన రాజకీయం



- జనం బాట పట్టిన నాయకులు
- హోరెత్తుతున్న ప్రచారం
- కూటమి అభ్యర్థుల జోరు
- రంగంలోకి కుటుంబీకులు
- ప్రజల నుంచి విశేష స్పందన
- వైసీపీకి కార్యకర్తలు దూరం
- వలంటీర్లతో నెట్టుకొస్తున్న వైనం
- మరో 10 రోజుల్లో నోటిఫికేషన్



బిక్కవోలు మండలం కొంకుదురులో న్యాయం కోసం నల్లమిల్లి యాత్రలో మూలారెడ్డి చిత్రపటానికి హారతి పడుతున్న మహిళ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రాజకీయం వేడెక్కింది.ప్రధాన పార్టీలన్నీ తమ అభ్యర్థులను ఖరారు చేయడంతో ప్రచారం జోరందుకుంది. జిల్లాలో ఈసారి ఎన్నికలు రసవత్తరంగా సాగనున్నాయి. ఎందుకంటే ఎప్పుడెప్పుడంటూ ఎన్నికల తేదీ కోసం ఎదురుచూస్తున్నారు.ఎవరి నోట విన్నా ప్రజావ్యతిరేక వైసీపీ విధానాలపై విరుచుకుపడుతున్నారు. ఇంత వరకూ జరిగిన ఎన్నికలు వేరు. ఈసారి జరిగే ఎన్నికలు వేరు అన్నట్టు విధానాలు మారిపోయాయి. 2019 సాధారణ ఎన్నికల వరకూ ఎవరైనా పోటీ చేయవచ్చు. ఎవరైనా ప్రచారం చేసుకోవచ్చు.ఎవరైనా నెగ్గవచ్చు అనే విధంగా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన స్థానిక ఎన్నికల ఎంత అప్రజాస్వామికంగా జరిగాయో అందరికీ తెలిసిందే. ప్రతిపక్షాలను నామినేషన్లు కూడా వేయనీయకుండా, పోటీకి ముందుకు రాకుండా కేసులు బనాయించడం,ప్రలోభాలు పెట్టడం వంటి అనేక అప్రజాస్వామిక విధానాలు కళ్లెదుటే కనిపించాయి. దీంతో చాలా చోట్ల ప్రతిపక్షాలు ఎన్నికల్లో పోటీచేయలేని పరిస్థితి ఏర్పడింది. పోరాడి స్థానిక ఎన్నికల్లో గెలిచినా అధికార వైసీపీని కాదని ఏమి చేస్తామనే ఉదాశీనత కూడా అప్పట్లో ఏర్పడింది.తర్వాత క్రమంగా పరిస్థితులు మారాయి. సొసైటీ, కొన్ని గ్రామ పంచాయతీల ఎన్నికలు నిర్వహించడానికి కూడా అధికార వైసీపీ భయపడిన సంగతి తెలిసిందే. దానికి రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎన్నికలే ఉదాహరణ. వార్డు రిజర్వేషన్లు ఖరారు చేసి, మేయర్ రిజర్వేషన్ కూడా ఖరారు చేసినా ఎన్నికలు జరగనీయలేదు. దానికి తోడు రూరల్ మండలంలోని సుమారు 11 గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేశారు. వాటికి ఎన్నికలు నిర్వహించలేదు. రాజానగరం, కోరుకొండ పరిధిలోని పలు పంచాయతీలను మొదట విలీనం చేసి తర్వాత ఆపే శారు. ఇదే కాకుండా ప్రభుత్వ విధానాలు ప్రజలకు నచ్చలేదు.ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలే త్వరగా ఎన్నికలు జరగాలని స్వచ్ఛందంగా కోరుకుంటున్నారు.

ఓట్లు చీలకూడదనే జట్టుగా..

ఒక్క ఓటు కూడా చీలకూడదనే ఉద్దేశంతో టీడీపీ-జనసేన- బీజేపీ పొత్తుపెట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ కూటమి చాలా బలీయంగా ఉంది. జిల్లాలో కూటమి అభ్యర్థులందరూ ఖరారయ్యారు. కూటమిగా జట్టు కట్టడం వల్ల కొందరు ఆశావహులకు సీట్లు దక్కలేదు. త్యాగాలు తప్పవని,వారందరికీ అధికారంలోకి రాగానే స్థాయికి తగ్గని విధంగా హోదా కల్పిస్తామని హామీలు ఇస్తూ, బుజ్జగిస్తూ పార్టీలు ముందుకు పోతున్నాయి. అనపర్తి టికెట్ మారడం వల్ల మొదటి జాబితాలోనే టికెట్ పొందిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి న్యాయం కోసం నల్లమిల్లి యాత్ర చేస్తున్నారు. తొలిజాబితాలో ఇచ్చిన పొత్తు నేపథ్యంలో అనపర్తి సీటును మార్చి బీజేపీకి ఇచ్చారు. ఈ సీటు విషయం కూడా తేలినట్టు సమాచారం. రేపో మాపో మళ్లీ రామకృష్ణారెడ్డికే సీటు దక్కే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా ఎన్నికల అధికారులు నిఘా పెంచారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు అనేక చోట్ల వాహనాలను తనిఖీ చేస్తున్నారు.ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ అవుతుంది. అప్పటి నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. 29తో నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుంది.మే 13న పోలింగ్. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో అంతా ప్రచారంపై దృష్టిపెట్టారు.

ప్రచారంలో ఎవరి దారి వారిదే..

జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానం ఉన్నాయి. ఇప్పటికే టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను ఖరారు చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ, రెండు జనసేన, పార్లమెంట్ పాటు ఒక అసెంబ్లీ స్థానంలో బీజేపీ తమ అభ్యర్థులను ఖరారు చేసింది. జిల్లాలో కూటమి అభ్యర్థులుగా రాజమహేంద్రవరం సిటీ ఆదిరెడ్డివాసు, గోపాలపురం మద్దిపాటి వెంకట్రాజు, రాజానగరం బత్తుల బలరామకృష్ణ, నిడదవోలు కందుల దుర్గేష్,రాజమహేంద్రవరం రూరల్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి. కొవ్వూరు ముప్పిడి వెంకటేశ్వరరావు పోటీలో ఉన్న సంగతి తెలిసిందే.అనపర్తి నుంచి బీజేపీ అభ్యర్థిగా ఎం. శివ కృష్ణంరాజు పేరు వినిపిస్తున్నా..ఈ పేరు మారే అవకాశం ఉంది.నల్లమిల్లికే మళ్లీ టిక్కెట్ ఇచ్చే సూచనలున్నాయి. వీరంతా ఇప్పటికే ఊరూరా ప్రచారం మొదలు పెట్టారు. సామాజిక వర్గాల వారీ సమావేశాలు నిర్వహిస్తూ హామీలు ఇస్తున్నారు.కుటుంబీకులు తమ వారి కోసం తీవ్రంగా ప్రచారం చేస్తున్నారు. ప్రచారంలో గోరంట్ల స్టయిలే వేరుగా ఉంది. సుమారు 10 రోజుల పైపైనుంచే ఇంటింటా ఓటర్ల వివరాలు సర్వే చేయించి నట్టు సమాచారం. అక్కడ ఎన్ని ఓట్లు, కులం, తదితర వివరాలు సేకరించడంతో పాటు ప్రత్యేకంగా పార్టీ కార్యకర్తతో ప్రచారం చేయిస్తున్నారు. గోపాలపురంలో మద్దిపాటి మొదటి దఫా ఊళ్లలో పాదయాత్రలు చేస్తూ ప్రజలకు దగ్గరవుతున్నారు. కొవ్వూరులో ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రచారంలో దూసుకుపోతున్నారు. నిడదవోలు జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్‌తో కలిసి టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ప్రచారం చేస్తున్నారు. ఆదివారం దుర్గేష్ కుమార్తె ప్రియాంక రంగంలోకి దిగారు. రాజానగరంలో జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ కలసి ప్రచారం చేస్తున్నారు. అంతే కాకుండా బలరామకృష్ణ భార్య, కుమా ర్తెలు వేర్వేరుగా ప్రచారం చేస్తున్నారు. రాజమహేంద్రవరం సిటీలో ఆదిరెడ్డి వాసు,ఆదిరెడ్డి అప్పారావు వేర్వేరుగా ప్రచారం చేస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లో గోరంట్ల బుచ్చయ్యచౌదరి తరపున ఆయన కుమార్తె శిరీష రంగంలోకి దిగారు. ఇక ఎంపీ అభ్యర్థిగా బలమైన నేత దగ్గుబాటి పురందేశ్వరి వచ్చిన సంగతి తెలిసిందే. గత మూడు రోజులుగా జిల్లాలో ప్రచారం చేస్తున్నారు. అంతే కాకుండా ఇటీవల చంద్రబాబు నాయుడు నిర్వహించిన ప్రజాగళం సభతో నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. వైసీపీ అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. కానీ పార్టీలో ఎవరి తీరు వారిదే అన్నట్టుగా ఉంది. ఒకరి ద్దరు తప్ప అందరూ పాత వాళ్లే కావడంతో వెన్ను పోట్లుకు సిద్ధమవుతున్నారు. పాలకులు ఐదేళ్ల కార్య కర్తలను పట్టించుకోకపోవడంతో ఇప్పుడు మేముందుకు చేయాలి అనే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో చాలా నియోజకవర్గాల్లో కార్యకర్తలు దూరంగా ఉంటున్నారు. ఇదిలా ఉండగా నాయకులు వారి స్థానాల్లో వలంటీర్లను రాజీనామా చేయించి మరీ ఎన్నికల రంగంలోకి దింపు తున్నారు. దీంతో కార్యకర్తలు ఒక్కొక్కరుగా దూరమైపోతు న్నారు. ఇక మా అవసరం ఏముందనే ధోరణిలో నాయకులు, కార్యకర్తలు ఉంటున్నారు. ప్రచారంలో కలిసి తిరిగినా అంటీముట్టనట్టుగానే ఉంటున్నారు.



రాజమహేంద్రవరంలో ప్రచారం చేస్తున్న ఆదిరెడ్డి వాసు, పురందేశ్వరి తనయుడు హితేష్



రాజమహేంద్రవరం రూరల్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి చిత్రంలో గోరంట్ల తదితరులు

కూటమిని గెలిపించండి

- ఫ్యాన్‌ని తిరగనీయకండి
- వైసీపీని గెలిపిస్తే ప్రమాదకరమే
- జగన్‌ను సాగనంపాలి
- కూటమికి అండగా ఉండాలి
- నేను రాజమండ్రి ప్రతిష్ట పెంచుతా..
- ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఓ తుఫాన్ వల్ల దివిసీమ కొట్టుకుపోయింది. హుద్‌హుద్ వల్ల విశాఖ దెబ్బతింది. ఇవి ప్రకృతి వైపరీత్యాలు. కానీ రాష్ట్రంలో ఇవాళ వాటికంటే ప్రమాదకరమైన విపరీత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దాలంటే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. చెరుకూరి కల్యాణ మండపంలో ఆదివారం రాజమహేంద్రవరంలో ఆదివారం నిర్వహించిన రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడా రు. ఫ్యాన్ ఇంట్లోనే ఉండాలంట.. 175 ఫ్యాన్‌లు తిరగాలంట..అయితే ఈ హోరుకు ఇళ్లలో ఎవరూ ఉండలేరు. అందుకే ఈ ఫ్యాన్‌గాలి బాగా తగ్గించాలని పిలుపునిచ్చారు.ఏ పార్టీ అయినా మొత్తం సీట్లలో పోటీ చేయాలనుకుంటుంది. కానీ రాష్ట్రంలో దుర్మార్గుడిని సాగనంపడానికి మూడు పార్టీలు కూటమిగా ఏర్పడడం వల్ల కొందరు త్యాగాలు చేయవలసి వచ్చిందన్నారు. వారికి బాధ ఉంటుంది కానీ పరిస్థితిని అర్థం చేసుకుని కూటమికి అండగా ఉండాలన్నారు. పార్లమెంట్‌లో నన్ను, సిటీలో ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ గోరంట్ల బుచ్చయ్యచౌదరితో పాటు మొత్తం కూటమి అభ్యర్థులందరినీ గెలిపించాలన్నారు. తమను ఆశీర్వదించాలని కోరారు. జగన్ ఓ మాఫియా అన్నారు. నాకు రాజమహేంద్రవరం భౌగోళిక పరిస్థితులు కూడా తెలియవని అంటున్నారు. నాకు తెలియకపోతే నేర్చుకుంటాను. ఆ తత్వం ఉంది.అంతేకాదు. చారిత్రక రాజమహేంద్రవరం ప్రతిష్టతను అతని మాదిరిగా దిగజార్చనని ఆమె ఘాటుగా కౌంటర్ వేశారు.సాంస్కృతిక కేంద్రమైన రాజమహేంద్రవరంలో తెలుగు విరజిల్లింది. రాజరాజనరేంద్రుడు, ఆదికవి నన్నయ్య,టంగుటూరి ప్రకాశంపంతులు, కందుకూరి వీరేశలింగం వంటి మహానుభావులు నడయాడిన నేల, నేను ఇక్కడ ప్రతిష్ఠ పెంచడానికి ప్రయత్నిస్తానని స్పష్టం చేశారు. రూరల్ అభ్యర్థి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ రాగద్వేషాలు లేకుండా అందరూ కలసి పనిచేయాలని, సైకో జగన్‌ను సాగనంపాలన్నారు. ఎన్టీఆర్ బిడ్డ పురందేశ్వరిని నాకంటే ఎక్కువ ఓట్లతో గెలిపించాలని, వచ్చే పుష్కరాలు నాటికి ఆమె ఇక్కడ అభివృద్ధి చేసి,మౌలిక సదుపాయాలు కల్పించి, పారిశ్రామిక రంగం అభివృద్ధికి బాటలు వేస్తారన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, కంఠంనేని శిరీష్, మత్స్యేటి ప్రసాద్, వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, ఆకుల శ్రీధర్, వీరా ప్రకాష్, ముద్రగడ, సీతారాం, నారాయణగౌడ్, మార్ని వాసు పాల్గొన్నారు.



9 గ్యారెంటీలతో ఏపీకి న్యాయం

కాంగ్రెస్ అబ్జర్వర్ మనోజ్ చౌహాన్

రంప అభ్యర్థి మార్పు ఉండదు

నియోజకవర్గ అబ్జర్వర్ శ్రీనివాసరావు

5

నాడు విద్యార్థులు.. నేడు ప్రముఖ వైద్యులు

50 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు

రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 7 : నేటి విద్యార్థులే రేపటి పౌరులు.. ఎవరు ఎంత ఎత్తుకు ఎదురుతారో చెప్పడం కాస్త కష్టమే.. భవిష్యత్ నడిపిస్తుంది.. బావిభారత పౌరులుగా ఎదుగుతారు.. రాజమ హేంద్రవరం వీ.టీజూనియర్ కాలేజీలో 1972-74 బ్యాచ్ ఇంటర్మీడియెట్ బైపీసీ చదివిన పూర్వ విద్యార్థులే అందుకు ఉదాహరణ. 50 ఏళ్ల తర్వాత వాళ్ల సంగతెందుకంటారా.. ఎందుకంటే తాము ఇంటర్మీడియెట్ పూర్తి చేసి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నాటి విద్యార్థులంతా ప్రకాశ్‌నగర్ ధర్మంచర కమ్యూనిటీ హాలులో ఆదివారం కలుసుకున్నారు.. గోల్డెన్ జూబ్లీ వేడుకను ఆనందంగా జరుపుకున్నారు. ఎప్పుడూ బిజీగా ఉండే వారంతా ఒరేయ్ అరేయ్ అంటూ నాటి స్మృతులను గుర్తు చేసు కున్నారు. ఇంతకీ ఈ బ్యాచ్‌లో చాలా మంది వైద్యులుగా స్థిరపడ్డారు. డాక్టర్ దాట్ల భాస్కరరాజు,ప్రసాదరాజు ,డీఎస్ఎన్‌రాజు,రాపాక వీరభద్రస్వామి,కేదారి.ఎం.ఆదివిష్ణు తదితరులు ఉన్నారు. ప్రతి ఏటా ఇలాగే కలుసుకోవాలని నిర్ణయించారు.

కూటూరు సంఘటనపై గిరిజనాగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వంతల

● ఎన్నికల కమిషన్ విచారణ జరిపించాలని డిమాండ్

కూనవరం, ఏప్రిల్ 7: శనివారం జరిగిన వైసీపీ ప్రచారంలో కూటూరులో ఇద్దరు గిరిజనులు గాయాలపాలుకావడంతో గిరిజన సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అధికార మత్తులో వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అమాయక గిరిజనులపై దాడి చేయిస్తున్నారన్నారు. జరిగిన సంఘటనపై ఎన్నికల కమిషన్ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సంఘటనపై గిరిజనులంతా ఏకం కావాలని ఎమ్మెల్సీ అనంతబాబుపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ ప్రకటించారు. బీజేపీ నాయకులు పాయం వెంకయ్య సైతం కూటూరు సంఘటనపై పూర్తి విచారణ జరిపిం చి దోషులను శిక్షించాలన్నారు. టీడీపీ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి మాట్లాడుతూ కేసు ను పోలీసులు పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నార న్నారు. ఇద్దరు గిరిజనులకు తీవ్ర గాయాలైనప్పటికీ తోపులాటలో గాయమైనట్లు చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని వంతల విమర్శించారు. సంఘటనపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పొడియం అప్పారావు, గడేసుల ప్రేమ్‌చంద్, రసూల్, వెంకటేష్, మహిళా నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజన నాయకులు

ఎమ్మెల్సీ, పోలీసులపై చర్యలు తీసుకోవాలి

● టీడీపీ మండలాధ్యక్షుడు కారం సురేష్‌బాబు

రంపచోడవరం ఏప్రిల్ 7: ఎన్నికల ప్రచారం పేరుతో రాత్రి పూట ఆదివాసీ గ్రామాల్లో గొడవలు పెడుతున్న వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు కారం సురేష్‌బాబు అన్నారు. ఆదివారం కూనవరం మండలంలోని కూటురు గ్రామంలో ఎమ్మెల్సీ ప్రచారానికి వెళ్లగా వైసీపీ పాలనలో తమ సమస్యలు పరిష్కారం కాలేదని ప్రశ్నించిన అమాయక గిరిజనులపై అనంతబాబు అనుచరులు, పోలీసులు దాడి చేయడం దారుణమని కారం సురేష్‌బాబు అన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబు కండిషనల్ బెయిల్ రద్దు చేయాలన్నారు.

తుపాకులతో కొట్టించడం దుర్మార్గం

● బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోళ్ల బొజ్జిరెడ్డి

రంపచోడవరం ఏప్రిల్ 7: కూనవరం మండలం కూటూరు గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ ప్రజల సమస్యలు తెలుసుకోవాల్సింది పోయి, ఆదివాసీ యువకులను తుపాకులతో కొట్టించడం దుర్మార్గం అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోళ్ల బొజ్జిరెడ్డి అన్నారు. వైసీపీ పాలకులకు దళితులు, ఆదివాసీలు అంటే చులకనా అని, హంతకుడికి ఎన్నికల కోడ్‌లో ప్రచారానికి అనుమతి లేకుండా చర్యలు తీసుకోవాలని సోళ్ల బొజ్జిరెడ్డి కోరారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు.

9 గ్యారెంటీలతో ఏపీకి న్యాయం

● ఏఐసీసీ అబ్జర్వర్ మనోజ్ చౌహాన్, ఎంపీ అభ్యర్థి గిడుగు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 7: ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కాంగ్రెస్‌పార్టీ 9 గ్యారెంటీలతో న్యాయం చేస్తుందని ఏఐసీసీ రాష్ట్ర పరిశీలకుడు మనోజ్‌చౌహాన్ అన్నారు. రాజమహేంద్రవరం హోటల్ ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రధాని మోదీ, అమిత్ షాలను ఎదుర్కొనే ఏకైక నాయకుడు రాహుల్‌గాంధీ అని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజలందరినీ కాంగ్రెస్ నాయకులు కలవాలని, రాష్ట్రానికి జరిగిన అన్యాయం, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు వివరించాలన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీ ప్రత్యేక హోదాను తీసుకురాలేపోయిందన్నారు. రాష్ట్రానికి న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ అన్నారు. రాజమహే ంద్రవరం లోక్‌సభ అభ్యర్థి గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసులం తామేనని జగన్ కేవలం వైఎస్ఆర్ ఆస్తికి మాత్రమే వారసుడని స్పష్టం చేశారు. దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లు సుంకర పద్మశ్రీ, జంగా గౌతమ్, ఎస్ఎన్ రాజా, రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి బోడా వెంకట్, రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళీధర్, అనపర్తి అభ్యర్థి డాక్టర్ యళ్ల శ్రీనివాసరావు, రాజానగరం అభ్యర్థి ఎం.వెంకటశ్రీనివాస్, కొవ్వూరు అభ్యర్థి అరిగెల అరుణకుమారి, నిడదవోలు అభ్యర్థి పెదిరెడ్డి సుబ్బారావు, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి శ్రీనివాస్, సీపీఐ నుంచి కొండలరావు, సీపీఐ కార్యదర్శి ముళ్ళ మాధవ్, మార్టిన్ లూథర్, ఆకుల సూర్యభాగ్యలక్ష్మి, కృష్ణాజిల్లానాయకులు సంజీవరెడ్డి, కొత్తూరి శ్రీను, మట్టాప్రసాద్, రవి పాల్గొన్నారు.



సమైక్య అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాడపల్లిలో ఘనంగా అధ్యయనోత్సవాలు

● గరుడ, సింహ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవం



గరుడు, సింహ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవం

ఆత్రేయపురం, ఏప్రిల్ 7: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు ఆదివారం మూడోరోజుకు చేరుకున్నాయి. వసంత మండపంలో వేద పండితులు చతుర్వేద పారాయణ, ద్రవిడ వేద పారాయణలను ఘనంగా నిర్వహించారు. రాత్రి మేళతాళ, మంగళ వాయిద్యాలు, బాణ సంచాకాల్పుల నడుమ గరుడ, సింహవాహనాలపై స్వామివారు తిరు వీధుల్లో భక్తులను కటాక్షించారు. చంగోలం పారాయణం శాస్త్రోక్తంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఏర్పాట్లను ర్యవేక్షించారు.

నరసన్నకు హైకోర్టు జస్టిస్ పూజలు



హైకోర్టు జస్టిస్ రవినాథ్‌తిహారికి స్వామి ఫొటో అందిస్తున్న సూపరింటెండెంట్ విజయసారథి

అంతర్వేది, ఏప్రిల్ 7: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టిస్ రవినాథ్‌తిహారి ఆదివారం విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు, స్వామివారి దర్శనం అనంతరం రవినాథ్ తిహారికి వేద పండితులచే మహదాశీర్వచనం జరిపించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయసారధి,రాజోలు జడ్జీలు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ట్రక్కు ఆటో

● ఎనిమిది మందికి గాయాలు

ముమ్మిడివరం, ఏప్రిల్ 7: ఆటోను వెనుక నుంచి ట్రక్కు ఆటో ఢీకొనడంతో ఏడుగురు ప్రయాణికులు, ఆటో డ్రైవర్ గాయపడ్డాడు. ఆదివారం ఉప్పలగుప్తం మండలం కూనవరం నుంచి యానాం శుభ కార్యక్రమానికి ఆరుగురు మహిళలు, ఓ వ్యక్తి ఆటోలో వెళ్తున్నారు. 216 జాతీయ రహదారి బొండాయికోడు పెట్రోల్ బంకు సమీపంలో ఆటోను వెనుక నుంచి ట్రక్కు ఆటో ఢీకొట్టింది. ఆటో నుజ్జునుజ్జు అయింది. ఆటోలో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు నేలపాటి రమేష్‌బాబు-లోకుమారి, చల్లపల్లికి చెందిన కాగిత సుహాసినిలు తీవ్రంగా గాయపడగా, చల్లపల్లికి చెందిన కాగిత దుర్గారత్నం, బుంగా నర్సమ్మ, కూనవరానికి చెందిన బడుగు రాజేశ్వరి, కిత్తన చెరువుకు చెందిన జొన్నాడ ధనలక్ష్మి, కూనవరానికి చెందిన ఆటో డ్రైవర్ నేలపాటి చంటిబాబు గాయపడ్డారు. వీరిని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవుడి ప్రధానాలయం

ధ్వజస్తంభం తొలగింపు

● 15 గ్రాముల బంగారు, ఇతర లోహాలు లభ్యం

● నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో వేయాలని నిర్ణయం



పూర్తిగా తొలగించిన సత్యదేవుడి ఆలయ ధ్వజస్తంభం



ధ్వజస్తంభం అడుగుభాగంలో లభించిన బంగారం, తదితర లోహాలు

అన్నవరం, ఏప్రిల్ 7: రత్నగిరివాసుడైన సత్యదేవుడి ప్రధానాలయంలో శిథిలావస్థకు చేరిన ధ్వజస్తంభం తొలగింపు ప్రక్రియను ఆదివారం పూర్తిచేశారు. అడుగుభాగంలో సుమారు 15 గ్రాముల బంగారం ఇతర లోహాలు లభ్యమయ్యాయి. వీటిని కొత్తగా లోహాలతోపాటు నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన రోజున అడుగుబాగంలో వేయనున్నట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ తెలిపారు. ఈనెల 18 నుంచి నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ప్రారంభమై 22న ప్రతిష్ఠించనున్నారు. సుమారు రూ.4కోట్ల వ్యయంతో నెల్లూరుకు చెందిన ఒక దాత అందించనున్నారు. నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా చేపట్టాలని నిర్ణయించారు. ఈకార్యక్రమానికి దేవదాయశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్‌ను ఆహ్వానించనున్నట్లు ఆలయవర్గాలు వెల్లడించాయి. భక్తులు, గ్రామస్థులు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు విచ్చేయాలని అధికారులు కోరారు. మరో వందేళ్ల వరకు ఇటువంటి కార్యక్రమం జరగనందున అధికసంఖ్యలో భక్తులు విచ్చేస్తారని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉగాది వేడుకలకు సత్యదేవుడి ఆలయం ముస్తాబు

● పంచాంగ పఠనం ఇతర వైదిక కార్యక్రమాలు

అన్నవరం, ఏప్రిల్ 7: ఈనెల 9న క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినం పురస్కరించుకుని అన్నవరం సత్యదేవుడి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ తెలిపారు. వేకువజామున సుప్రభాతసేవ అనంతరం స్వామి, అమ్మవార్లకు అభ్యంగన స్నానమాచరింపచేసి నూతన పట్టువస్త్రాలను ధరింపచేసి ఉదయం 9గంటలకు పంచాంగ ఆవిష్కరణ, 9.30కి గొల్లపల్లి సుబ్రహ్మణ్య ఘనాపాఠిచే పంచాంగ శ్రవణం, 10గంటలకు ఉగాది పచ్చడి వితరణ గావించి 5గురు పండితులకు ఉగాది పురస్కారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. కళామందిరంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు, 11గంటలకు వెండి రథంపై స్వామి,అమ్మవార్ల ఊరేగింపు, రాత్రి 7గంటలకు కొండదిగువ వెండిగజవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు.

సత్యదేవుడి ఆలయ విశిష్టత, వైదిక కార్యక్రమాలపై

డాక్యుమెంటరీ చిత్రీకరణకు ఉత్తర్వులు

అన్నవరం, ఏప్రిల్ 7: అన్నవరం సత్యదేవుడి ఆలయ విశిష్టత, నిత్యం జరిగే వైదిక కార్యక్రమాలపై డాక్యుమెంటరీ చిత్రీకరించాలని దేవదాయ కమిషనర్ ఆదేశాల మేరకు ఈవో రామచంద్రమోహన్ ఆదివారం చిత్రీకరణ సంస్థకు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని ఆదిరాజు సినీక్రియేషన్స్ సంస్థ చిత్రీకరిస్తోంది. డిజిటల్ ఫార్మట్‌లో సుమారు 20 నిమిషాల నిడివితో వీటిని చిత్రీకరిస్తామని నిర్మాణ సంస్థ డైరెక్టర్ కార్తీక ఆదిరాజు తెలిపారు. ఆలయంలో జరిగే నిత్య కార్యక్రమాలతో పాటుగా ప్రతీ సంవత్సరం ఆలయంలో నిర్వహించే పండుగలు, బ్రహ్మోత్సవాలు, తెప్పోత్సవం, గిరిప్రదక్షణ, రత్నగిరిపై ఉన్న ఉపాలయాలు, స్వామివారి ప్రసాదం విశిష్టత, తదితర అంశాలను చిత్రీకరించనున్నట్లు ఆమె తెలిపారు. గతంలో సింహాచలం ఆలయ విశిష్టత డాక్యుమెంటరీని తమ నిర్మాణ సంస్థ చిత్రీకరించిందన్నారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు తదితరులు ఉన్నారు.



డాక్యుమెంటరీ చిత్రీకరణకు ఉత్తర్వులు అందజేస్తున్న ఈవో రామచంద్రమోహన్

రంపచోడవరం అభ్యర్థిని మార్పు ఉండదు

● అధిష్ఠానం నిర్ణయం మేరకు క్యాడర్ సమన్వయంతో ముందుకెళ్లాలి

● రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసరావు



మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసరావు

ఎటపాక, ఏప్రిల్ 7: రంపచోడవరం ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మార్పు ఉండదని, త్వరలో అభ్యర్థి మార్పు జరుగుతుం దంటూ వస్తున్న వదంతుల్లో వాస్తవం లేదని టీడీపీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీల కుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన గుండాల కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత (2019) ఎన్నికల్లో జరిగిన తప్పు ఒప్పులను పరిగణనలోకి తీసుకుని, ఈ సారి అభ్యర్థిని విషయంలో పార్టీ అధి ష్ఠానం నిర్ణయం తీసుకుందని చెప్పా రు. రెండు రోజుల కిందటే అధినేత చంద్రబాబు ఈ విషయం తెలియజేయాలని తనకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. పార్టీలో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వేరే అభ్యర్థిని ప్రకటిస్తారని ప్రచారం చేస్తున్నారని , అందులో నిజంలేదని తెలిపారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు నియోజకవర్గంలో క్యాడర్ అంతా సమన్వయంతో పనిచేస్తూ మిరియాల శిరీషాదేవీ గెలుపునకు కృషిచేయాలని కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు అన్ని అంశాలను బేరీజు వేసుకుని, అభ్యర్థిని విషయంలో తుది నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఈసారి టీడీపీ గెలుపు అవకాశమున్న ఈ ప్రాంతంలో గ్రూప్ వర్గాలతో పనిచేస్తే, పార్టీకి నష్టం వాటిల్లుతుందని, అటువంటి నాయకులు, కార్యకర్తలపై పార్టీ అధిష్ఠానం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. పార్టీకోసం కష్టపడిన వారికి, గుర్తింపు ఉంటుందని, పార్టీ అధికారంలోకి రాగానే గుర్తింపునకు తగిన న్యాయం జరుగుతుందని చెప్పారు. 15 ఏళ్ల తర్వాత ఈసారి ఎన్నికల్లో రంపచోడవరం గడ్డపై టీడీపీ జెండా ఎగురువేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరావు, పార్టీ సీనియర్ నాయకులు కిలారి వెంకటేశ్వరరావు, మాజీ వైఎస్ ఎంపీపీ రావిమాధవ రావు, సీనియర్ నాయకులు నలజాల శ్రీకాంత్ చౌదరి, బొల్లా పుల్లయ్య, ఏలూరి వెంకన్న, బాచినేని మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు

పిఠాపురం, ఏప్రిల్ 7: కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆర్చరీ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 50మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. ఇండియన్ రౌండ్ విభాగంలో సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో విజేతలకు పతకాలు, బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. పోటీలను ప్రారంభించి పర్యవేక్షించిన వారిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఎన్ఎస్ గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావు, రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, సీహెచ్‌వీ రమణ, కె.చిన్నబ్బాయి, జి.శివప్రసాద్, బి.సతీష్, పి.సాయి ఉన్నారు.



ఆర్చరీ పోటీల్లో విజేతలైన క్రీడాకారులు

దున్నపోతుతో తొక్కిస్తే.. పాపాలు పోతాయట!

● పోలేరమ్మ జాతరలో వింత ఆచారం ● అంతా మంచి జరుగుతుందనే నమ్మకం



దున్నపోతుతో తొక్కించుకుంటున్న మత్స్యకారులు

అమీనాబాద్(కొత్తపల్లి), ఏప్రిల్ 7: దున్నపోతుతో తొక్కించుకుంటే పాపాలు పోతాయన్నది కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం అమీనాబాదు మత్స్యకారుల నమ్మకం. దీనిలో భాగంగా ఆదివారం నిర్వహించిన పోలేరమ్మ జాతరలో ఈ వింత ఆచారంతో గ్రామస్తులు దున్నపోతుతో తొక్కించుకుని ఆనందపరవశ్యులయ్యారు. జాతర ముందురోజున ఇలా దున్నపోతుతో తొక్కించుకుంటే అంతా మంచి జరుగుతుందనే నమ్మకంతో పోటీలు పడ్డారు. వందలాది మంది మత్స్యకారులు ఇందులో పాల్గొన్నారు.

నూకాంబికా జాతర ఉత్సవాలు ప్రారంభం



ఆలమూరు, ఏప్రిల్ 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ఆలమూరు మండలం చింతలూరులో నూకాంబికా అమ్మవారి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. చంటి పిల్లలతో కాగడాలు వేయించడంతో పాటు తుళ్లబిళ్ల, వారపోయుట, కావిడి కోళ్ల మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్టు ఈవో ఎంఎస్ఆర్ కృష్ణ తెలిపారు. జాతరలో విద్యుత్ కాంతులు ఆకట్టుకున్నాయి. ఉత్సవాలు సజావుగా జరిగేందుకు ఆలమూరు ఎస్ఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో దాదాపు 300 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశారు.చింతలూరు నూకాంబికా అమ్మవారికి భక్తులు 20కిలోలతో వెండి ఆభరణాలు తయారు చేయించారు. స్థానిక భక్తుల సహకారంతో సేకరించిన వెండిహారంతో పాటు చేయించిన పలు ఆభరణాలను ఉత్సవాల సందర్భంగా ఆదివారం అలంకరించారు.

ఆకట్టుకున్న ఆర్ట్ ఎగ్జిబిషన్

పెద్దాపురం, ఏప్రిల్ 7: పెద్దాపురంలోని స్థానిక శ్రీప్రకాష్‌లో సినర్జీస్ పాఠ శాలలో హరివిల్లు కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వ హించిన ఆర్ట్ ఎగ్జిబిషనర్ ఎంతగానో ఆకట్టుకుంది. ఎగ్జిబిష న్‌లో భాగంగా దేశంలో పలు రాష్ట్రాల్లో ఉన్న సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాలు, పండుగలు తదితర విషయాల ను చిన్నారులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తమ పాఠశాల లో హరివిల్లు పేరుతో ఇంతటి మంచి కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషాన్ని కలిగించిందన్నా రు. కార్యక్రమంలో ఆకడమిక్ కల్చరల్ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.



సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు



లోవకు పోటెత్తిన భక్తులు

● ఆలయానికి 1.59 లక్షల ఆదాయం

తుని రూరల్, ఏప్రిల్7: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం ఆదివారం భక్తుల కోలాహలంగా మారింది. అమ్మవారి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారి దర్శనార్థం ప్రత్యేక క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు తల్లిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఏర్పాటుచేసిన వసతిగదులు, షెడ్‌లలో వంటావార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో విశ్వనాథరాజు తెలిపారు. ఆదివారం ఒక్కరోజే వివిధ విభాగాలద్వారా ఆలయానికి రూ.1.59లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈవో స్పష్టం చేశారు.

ఉత్తరకంచి బ్యాంక్ దోపిడీ కేసులో

ఏ1 నిందితుడి అరెస్ట్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 7: కాకినాడజిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి బ్యాంక్ దోపిడీ కేసులో ఆదివారం ఏ1 నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో ఈ కేసులో అరెస్ట్ చేసిన నిందితుల సంఖ్య 5కు చేరింది. ఉత్తరకంచి గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్‌లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన దుండగులు చోరీకి పాల్పడి భారీ ఎత్తున బంగారం, నగదును దోచుకున్నారు. దీనిపై జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించి పలుబృందాలను ఏర్పాటుచేసి ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మార్చి7న ఈ కేసులో నలుగురు వ్యక్తులను ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ లతాకుమారి, సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్‌లు బృందాలు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహ్మద్ సావేత్ హసన్‌ను ఆదివారం అరెస్ట్‌చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

గిరిజనులపై దాడికి సీపీఎం ఖండన


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

వరరామచంద్రాపురం, ఏప్రిల్ 7: కూనవరం మండలం కూటూరు గ్రామంలో శనివారం ఆదివాసి గిరిజనులపై చేసిన దాడిని మండల సీపీఎం పార్టీ తీవ్రంగా ఖండిం చింది. కూటూరు గ్రామానికి శనివారం రాత్రి ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చిన ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మిని గ్రామస్తులు జీవో నెం3, ఎకరాకు పోలవరం పరిహారం కింద లక్షా పదిహేను వేలు తీసుకున్న భూములకు ఎకరాకు 5 లక్షలు ఇస్తామన్నారు కదా...ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ 6 లక్షల 85వేలు ఇచ్చిన వాటికి 10లక్షలు చేస్తానన్నారు, రెండు మార్లు వచ్చిన గోదావరి వరదలకు నష్టపోయిన వారికి నష్టపరిహారం ఇస్తామని చేసిన వాగ్దానాలు ఏమయ్యా యని ప్రశ్నించిన ఆదివాసీలపై దాడిచేయడం అమానుషమని, అక్కడున్న పోలీసులు ఆదివాసి గిరిజనులను బెదిరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం మండల నాయకులు పూనెం సత్యనారాయణ, సోయం చినబాబు అన్నారు. దాడికి కారకులైన వారిపై చట్టపర మైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, గుండిపూడి లక్ష్మణరావు, పంకు సత్తిబాబు, వడ్లాది రమేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

యువకులపై దాడిని ఖండిస్తున్నాం

చింతూరు ఏప్రిల్ 7: కూనవరం మండలం, కూటూరు గ్రామంలో వైసీపీ నాయకుల ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలోకి వెళ్లి వైసీపీ నాయకులు ఆదివాసీ యువకులపై మూకుమ్మడి దాడిని చింతూరు టీడీపీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం చింతూరులో సమావేశంను నిర్వహించారు. ఈ దాడికి సూత్రధారైన ఎమ్మెల్సీ అనంతబాబుపై ఎలక్షన్ కమీషన్ సుమోటోగా కేసును నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కండిషన్ బెయిల్‌పై తిరుగుతున్న అనంతబాబు బెయిల్ రద్దు చేసి, ఎలక్షన్ ప్రచారంలో తిరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్ర మంలో టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు తుర్రం చిన ముత్తయ్య, ఎస్టీసెల్ మండల ప్రధాన కార్యదర్శి జల్లి మల్లయ్య, చింతూరు మండల టీడీపీ అధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి, పొదిలి రామారావు పాల్గొన్నారు.

బాధితులకు టీడీపీ అభ్యర్థి శిరీష పరామర్శ


గాయపడ్డ గిరిజనులను పరామర్శిస్తున్న శిరీష

కూనవరం, ఏప్రిల్ 7: కూటూరు సంఘటనలో గాయ పడ్డ రాము, వినోద్‌లను రంప చోడవరం టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీష పరామర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అమాయక గిరిజనులపై దాడిచేసిన వైసీపీ నాయకులను శిక్షించాలన్నారు. దీనిపై తాము పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బరపాటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి బీసీలు వెన్నుముక

● బీసీ జయహో కార్యక్రమంలో శిరీషాదేవీ

ఎటపాక, ఏప్రిల్ 7: మీ ఆడబిడ్డగా వస్తున్నా... త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఓటువేసి, ఆశీర్వ దించాలని రంపచోడవరం ఎన్డీఏ కూటమి అభ్యర్థిని మిరియాల శిరీషాదేవీ కోరారు. ఆదివారం గుండాల కాలనీ గ్రామంలో జయహో బీసీ సభను నిర్వహించా రు. ఈసందర్భంగా జరిగిన సభలో మిరియాల శిరీషాదేవి మాట్లాడారు. బీసీలు టీడీపీకి వెన్నుము కలాంటి వారని, టీడీపీ హయాంలో బీసీలకు పెద్దపీటవేశారన్నారు. టీడీపీ బీసీలకు 30 రకాల సంక్షే మ పథకాలను అమలు చేస్తే, వైసీపీ వచ్చాక ఆ పథకాలను ఆటకెక్కించారని విమర్శించారు. గతప్రభు త్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే, వైసీపీ వచ్చాక దానిని 24 శాతంకు కుదించిందని గుర్తు చేశారు. బీసీలకు ఎవరూ మేలు చేశారో బీసీలు ఆలోచించాలని అన్నారు. పోలవరం నిర్వాసితులు ఇళ్లు ఖాళీ చేసే సమయంలో 18 ఏళ్లుని ండిన ప్రతీ ఒక్కరికీ ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో టీడీపీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, వైఎస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, టీడీపీ సీనియం నాయకులు కిలారి వెంకటేశ్వరరావు, రావి మాధవావు, శ్రీకాంత్ చౌదరి, ఎన్డీఏ కూటమి నాయకులు పాయం వెంకయ్య, నోముల రామారావు, మారాసు గంగాధర్, బొల్లా ప్రసాద్, బొల్లా పుల్లయ్య, మోదుగు పెరమయ్య, మాచినేని రాజేష్, పాటిచలపతి పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన గొర్లె సునీత



రంపచోడవరం, ఏప్రిల్ 7: రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన గొర్లె సునీత టీడీపీ అధినేత చంద్రబాబును ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పర్యటనలో కలిశారు. రంపచోడవరం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని చంద్రబాబు కు వివరించి వినతి పత్రాన్ని కూడా ఇచ్చారు. రంపచోడవరం అభ్యర్థిత్వాన్ని తనకు ఇప్పించాలని ఆమె కోరారు. రంపచోడవరం నియోజకవర్గంపై పరిశీలన జరుగుతోందని చంద్రబాబు చెప్పినట్టు సునీత తెలిపారు.

'రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలి'

అడ్డతీగల, ఏప్రిల్ 7: రంపచోడవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని పునః పరిశీలించాలని అడ్డతీగల టీడీపీ కేడర్ అడ్డతీగలలో ఆదివారం మాజీ ఎంపీటీసీ అన్నం సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ మన నియోజకవర్గంలో టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గస్థాయి నాయకుల చేతుల నుంచి బయట వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుందని నిరాశ వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రంపచోడవరం అభ్యర్థిత్వాన్ని పున పరిశీలించి పార్టీలో ఉన్న సీనియర్స్ ఎవరికి సీటు ఇచ్చిన టీడీపీ నాయకులు ఒకే తాటిపైకి వచ్చి పార్టీని కంచుకోటగా చేస్తామని పేర్కొన్నారు.

ఏకలవ్య ప్రవేశ పరీక్ష 20కి వాయిదా

వై.రామవరం, ఏప్రిల్ 7: ఈనెల 13వతేదీన జరగాల్సిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలోని 6,7,8,9వ తరగతి విద్యార్థులకు జరిగే ప్రవేశపరీక్ష ఈనెల 20వ తేదీకి వాయిదా వేసినట్లు పి.యర్రగొండ ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీపాదరామకృష్ణ తెలిపారు. 20న ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30వరకు పరీక్ష జరుగుతుందని ఆయన తెలిపారు.

గోపాలపురంలో కార్చిచ్చు



మోతుగూడెం, ఏప్రిల్ 7: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో గోపాలపురం పలు ప్రాంతాల్లో ఉన్న అడవులు రెండు రోజులుగా దహనం అవుతున్నాయి. వేసవిలో సాధారణంగా చెట్లు నుంచి ఎండుటాకులు రాలిపోతాయి. వాటికి ఎవరైనా నిప్పు పెట్టినప్పుడు ఆ మంటలు మొత్తం అడవికి వ్యాపిస్తున్నాయి. ఫలితంగా పచ్చని చెట్లు దగ్ధమవుతున్నాయి. ఈ పొగ గ్రామాల్లోకి రావడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ దహనం అవుతున్న అడవులను ఆర్పే ప్రయత్నం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విధమైన మంటలు రావడంతో అటు వెళ్లే వాహనదారులు పొగతో ఇబ్బందులు పడుతున్నారు.

ఏపీ జెన్‌కో 327 యూనియన్ నుంచి రామకృష్ణ సస్పెన్షన్

మోతుగూడెం, ఏప్రిల్ 7: ఏపీ జెన్‌కో యూనియన్‌లో జెన్కో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కాళ్ళ రామకృష్ణను ఆ యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎంవీ రాఘవరెడ్డి సస్పెండ్ చేసినట్లు ఆ యూనియన్ సీలేరు కాంప్లెక్స్ రీజనల్ సెక్రటరీ పి. ఆనంద్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 5వ తేదీ(శనివారం)రాత్రి మోతుగూడెం 327 యూనియన్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కాళ్ళ రామకృష్ణ 327 యూనియన్‌లో ఏపీ జెన్కో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఫిబ్రవరి నెలలో 1104 యూనియన్ నాయకులతో కలిసి 327 యూనియన్ నాయకులను గంజాయి కేసులో ఇరికించాలని కుట్రపన్నాడు. అంతేకాకుండా యూనియన్ వ్యతిరేక కార్యక్రమాలను చేస్తున్నాడు. దీంతో 327 యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎంవీ రాఘవ రెడ్డి ఆయన్ను సస్పెండ్ చేసినట్లు ఆనంద్‌బాబు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

» గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 7: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని టీడీపీ-బీజేపీ-జనసేన నియోజకవర్గ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కుమార్తె కంటమనేని శిరీష కలిసి ఆయన శాటిలైట్ సిటీ సి బ్లాక్‌లో ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కలిగించారు. అలాగే స్థానిక పార్క్‌లో ప్రభుత్వ నిర్వాకంతో పేరుకుపోయిన చెత్తను నాయకులతో కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో పార్కులు మసకబారిపోయాయని, బ్లేడ్ బ్యాచ్‌లకు అడ్డాలుగా మార్చేసారని ఆరోపించారు. దోచుకోవడం, దాచుకోవడం తెలిసిన మంత్రికి ప్రజారోగ్యంపై ఏమాత్రం అవగాహన ఉందో ప్రజలు గమనించాలని గోరంట్ల అన్నారు. అనంతరం విజయ వారియర్స్ జట్టుకు గోరంట్ల, శిరీష వాలీబాల్ కిట్‌ను, క్రికెట్ కిట్‌ను అందజేసి అభినందనలు తెలిపారు. నలుగురు దివ్యాంగులకు వీల్ ఛైర్స్‌ను అందజేస్తామని గోరంట్ల హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు


శాటిలైట్ సిటీ సి బ్లాక్‌లో పార్క్‌ను శుభ్రం చేస్తున్న గోరంట్ల

మచ్చేటి ప్రసాద్, మార్ని వాసుదేవ్, మజ్జి పద్మావతి, దారా అన్నవరం, ఎస్ఎమ్ఆర్ శ్రీను, బొప్పన నాగేశ్వరరావు, జనసేన నాయకులు నాగేంద్ర, దుర్గారావు, కరుణాకుమార్, కాసినడ నాగబాబు, గేద్దడ కృష్ణ పాల్గొన్నారు.


ఎంపీ భరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న డ్రగ్స్ అసోసియేషన్ నాయకులు

ఆన్‌లైన్ మందులతో చేటు

» డ్రగ్స్ ట్రేడ్ అసోసియేషన్.. నూతన ప్యానెల్ ప్రమాణ స్వీకారం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మందుల విక్రయాల వల్ల ప్రజలకు తీవ్రంగా చేటు కలుగుతోందని జిల్లా డ్రగ్స్ ట్రేడ్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రాయపూడి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా స్థాయి నూతన ప్యానెల్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని జాతీయ స్థాయి డ్రగ్స్ ట్రేడ్ అసోసియేషన్ ప్రతినిధుల సమక్షంలో ఆదివారం నిర్వహించారు. ఆన్‌లైన్ మందుల విక్రయాల వల్ల మత్తు మందుల వినియోగం విపరీతంగా పెరిగిందన్నారు. జాతీయ స్థాయి డ్రగ్స్ ట్రేడ్ అసోసియేషన్ సహకారంతో వాటిని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ప్రమాణ స్వీకారోత్సవానికి విచ్చేసిన ఎంపీ భరత్‌రామ్‌కి మందుల షాపులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇండియన్ ఫార్మాస్యూటికల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ, సడ్డా రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రత్నం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి పిండి గణపతి, కోశాధికారి కె.శ్రీనివాసరావు, వినాయక్, పిల్లా బాల, ఎక్కల వీర నాగేశ్వరరావు, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నూకాలమ్మ జాతర



బిక్కవోలు, ఏప్రిల్ 7: బిక్కవోలు గ్రామ దేవత నూకాలమ్మ జాతరను సోమవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఆదివారం రాత్రి జాగరణ నిర్వహించామని, సోమవారం జాతర, గురువారం మహాన్నదానంతో ఉత్సవాలను ముగిస్తామన్నారు. జాగరణ కార్యక్రమంలో తీన్‌మార్, బ్యాండ్ మేళాలు, గరగ నృత్యాలు, విచిత్ర వేషధారణలు ఏర్పాటు చేశామన్నారు.

రాజానగరంలో..

రాజానగరం, ఏప్రిల్ 7: రాజానగరంలోని శ్రీనూకాలమ్మ తీర్థ మహోత్సవాన్ని ఈ నెల 8న నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారి జాతరను బాణసంచా కాల్పులు నడుమ వైభవంగా ప్రారంభించారు. సోమవారం తీర్థం నిర్వహించనున్నారు. గ్రామానికి చెందిన ముచ్చకర్ల మూలయ్య, జగ్గాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అమ్మవారికి రూ.3.70 లక్షలు విలువైన బంగారు మంగళ సూత్రాలు, వెండి కంఠాభరణం, వెండి కిరీటం బహూకరించారు. తీర్థం సందర్భంగా అమ్మవారి ప్రతిరూపంగా భావించే తాటి చెట్టుకు ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం చెట్టును ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసే ఊయలలో అమ్మవారి దర్శనం చేసుకున్న భక్తులు ఊయల ఊగడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని


రాజానగరంలో నూకాలమ్మ ప్రతిరూపమైన తాటి చెట్టు గ్రామోత్సవం

విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నేడు దేవీ గొల్లమారమ్మ జాతర

రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 7: రాజమహేంద్రవరం బెస్తావీధిలో 144 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీదేవీ గొల్లమారమ్మ జాతర సోమవారం నుంచి ప్రారంభంకానుంది. ఈ మేరకు గౌతమి గోదావరి బెస్తావారి సంక్షేమ సంఘం కార్యనిర్వాహక సభ్యులు వెలగల రామకృష్ణారెడ్డి, రాహుల్‌రెడ్డి, నేహంత్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. సోమవారం రాత్రి 8గంటలకు రథోత్సవం ప్రారంభమవుతుందన్నారు. ఉదయం నుంచి పూజలు చేస్తారని తెలిపారు.

రేపు కాళీదుర్గాంబిక జాతర

దివాన్‌చెరువు, ఏప్రిల్ 7: శ్రీకృష్ణపట్నంలో స్వయంభూ శ్రీకాళీదుర్గాంబిక జాతర మంగళవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ఆదివారం తెలిపింది. ఆ రోజు ఉదయం నుంచి అమ్మవారి పూజా కార్యక్రమాలు, బాణసంచా కాల్పులు, గరగ నృత్యం, కోలాటం జరుగుతాయని చెప్పారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న గన్ని కృష్ణ ఆదిరెడ్డి వాసు, హితేష్

కూటమిని గెలిపించండి

» రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 7: కూటమి అధికారంలోకి రావాలని టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి తనయుడు బీజేపీ నాయకుడు హితేష్ చెంచురామ్ అన్నారు. స్థానిక 22వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ మాటూరి రంగారావు, టీడీపీ నాయకులు శెట్టి జగదీష్, మాటూరి సిద్దు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓటు అనే ఆయుధంతో వైసీపీకి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డులోని రాయల్ మాస్క్ (పెద్దమసీదు)లో ముస్లింలకు గన్ని కృష్ణ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆదిరెడ్డి వాసు, దగ్గుబాటి హితేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ హాజరయ్యారు. రాజమహేంద్రవరం ఆర్యాపురం సత్యనారాయణ స్వామి ఆలయం సమీపంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వాసు మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా పనిచేస్తామని అందుకే తమ మేనిఫెస్టోలో ఆరోగ్యం రాజమండ్రి అంశాన్ని చేర్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో నగర టీడీపీ ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, ఎంఎస్ రావు, కొత్త రాజేష్, నిమ్మలపూడి గోవింద్, తక్కశాల పూర్ణ, నల్లం ఆనంద్, గ్రంధి రాజా, తమ్మన గోపాలకృష్ణ, లలిత్‌కుమార్ జైన్ పాల్గొన్నారు.

మన చేతిలోనే..మన ఆరోగ్యం

» డాక్టర్ హిప్పో పద్మాకమలాకర్

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 7: మన జీవితంలో ఆరోగ్యాన్ని పొందే మార్గం మన చేతుల్లోనే ఉంటుందని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్-ఇండియా అధ్యక్షురాలు డా.హిప్పో పద్మా కమలాకర్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో కస్తూర్బా ఆశ్రమంలో ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఆరోగ్య సేవలు, విద్య సమాచారం పొందడం ప్రతిఒక్కరి హక్కు అన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వి.హేమకుమారి, తణుకు సైకాలజిస్ట్ పి.రమేష్‌కుమార్ మాట్లాడుతూ మన ఆరోగ్యానికి నవ్వు ఒక దివ్యౌషధం వంటిదన్నారు. అది మన ఆనందాన్ని, ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. వైద్య సంఘం సభ్యులు విక్రమహాలులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నా ఆరోగ్యం- నా హక్కు నినాదం గురించి వివరించారు. యోగా గురువుతీడా రాము సాయినగర్ ఫ్లోరా పార్కులో ఉచిత యోగా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరం ఈ నెల 18వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. వివరాలకు 98666 16222నెంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సచ్చిన శ్రీనివాసరావు, ఆకాశం గౌరీష్‌బాబు, లొల్ల రామచంద్రరావు, జి.బుల్లియ్య, నామాల శ్రీనివాసరావు, శెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.


వృద్ధులకు పండ్లు అందజేస్తున్న హిప్పో పద్మకమలాకర్

క్యాడర్‌తో పురందేశ్వరి ఆత్మీయ సమావేశాలు


ఆత్మీయ సమావేశానికి హాజరైన మూడు పార్టీల నాయకులు


జనసైనికులతో మాట్లాడుతున్న పురందేశ్వరి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రచారం జోరందుకుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి మూడు పార్టీల నేతలు, కార్యకర్తలతో నియోజకవర్గాల వారీ ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ దగ్గరవుతున్నారు. కొద్దిరోజుల్లోనే ఆమె అందరికీ దగ్గరయ్యారు. ఈనెల 5న ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామికి పూజలు చేసి ఆమె ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. రాజమహేంద్రవరంలో పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం రాజమహేంద్రవరం సిటీ టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు, జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, రూరల్ అభ్యర్థి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మూడు పార్టీల కార్యకర్తలు, నేతలతో కలసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సోమవారం రాజానగరం, కొవ్వూరులో ఆత్మీయ సమావేశాలు నిర్వహించనున్నారు.

కొంకుదురులో 'న్యాయం కోసం నల్లమిల్లి'


కొంకుదురులో కుటుంబ సభ్యులతో కలిసి పర్యటిస్తున్న నల్లమిల్లి

అనపర్తి, ఏప్రిల్ 7: తమ కుటుంబానికి టీడీపీతో 42 ఏళ్లుగా విడదీయలేని బంధం ఉందని, వేరే జెండాపై పోటీ చేయబోనని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా అనపర్తి అసెంబ్లీ సీటును కోల్పోయిన ఆయన చేపట్టిన న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమాన్ని ఆదివారం బిక్కవోలు మండలం కొంకుదురులో నిర్వహించారు. తన తల్లి సత్యవతి, సతీమణి మహాలక్ష్మి, తనయుడు మనోజ్‌రెడ్డి తనయ డాక్టర్ సనాతనితో కలిసి పర్య టించి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. కాగా కొంకుదురు రామకృష్ణారెడ్డి సతీమణి మహాలక్ష్మి స్వగ్రామం. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులు నల్లమిల్లి వెంట నడుస్తూ న్యాయం కావాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సత్తి దేవదానరెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, ఆళ్ల గోవిందు, సిరసపల్లి లక్ష్మి, ఒంటిమి గౌతమి, కర్రి సత్యవతి, సుభాషిణి, జుత్తుగ సూర్యకుమారి, చిన బుజ్జి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నాగేంద్ర



నిడదవోలు, ఏప్రిల్ 7: నిడదవోలుకు చెందిన తానింకి వెంకట నాగేంద్రబాబు కాంగ్రెస్‌పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతా పద్మశ్రీ, జిల్లా అధ్యక్షురాలు అరుణకుమారి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్రను రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, తానంకి వెంకటేశ్వరరావు, హీరాలాల్, బలరామ్ అభినందించారు.

కోట సత్తెమ్మకు విశేషపూజలు

నిడదవోలు, ఏప్రిల్ 7: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ ఆలయంలో ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాతసేవ, ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు జరిపారు. అమ్మవారికి క్షీరనివేదన, మహానివేదన చేశారు. ప్రత్యేక అలంకరణలోఉన్న అమ్మవారిని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక దర్శనం, ప్రసాద విక్రయాలు, పూజా టికెట్లు విక్రయాలు, అన్నదాన విరాళాలు ద్వారా రూ.1,02,053 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.

2020లో అదృశ్యం.. నేటికీ ఆచూకీ లేదు

ఆవేదనలో వృద్ధుడి కుటుంబ సభ్యులు



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వృద్ధుడి అదృశ్యంపై మూడున్నరేళ్లుగా చిక్కుముడి వీడడం లేదు. దీంతో అసలు ఆయన ప్రాణాలతో ఉన్నారా? అని కుటుంబీకులు ఆవేదన చెందుతున్నారు. రెండో పట్టణ ఏఎస్ఐ పీవీ రమణమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన కుప్పా తమ్మేశ్వర శర్మ(70) దైవ చింతనతో రైల్వే స్టేషను సమీపంలోని వెంకట రామ అచల ఆశ్రమంలో ఉండేవారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న తన కుమారుడిని చూసి వస్తానని ఆశ్రమ వాసులతో చెప్పి 2020 అక్టోబరు 24న వెళ్లాడు. ఈలోగా తండ్రిని చూడడానికి కుమారుడు కుప్పా విశ్వనాథం హైదరాబాద్ నుంచి ఆశ్రమానికి వచ్చారు. ఆయన మీ వద్దకే హైదరాబాద్ వచ్చారని కుమారుడితో ఆశ్రమ వాసులు చెప్పారు. అయితే తండ్రి హైదరాబాద్ చేరకపోవడంతో విశ్వనాథం ఆందోళన చెందారు. పలు ప్రాంతాల్లో ఆరా తీసినా ఫలితం లేక రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. మూడున్న రేళ్ల గడిచినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. తమ్మేశ్వరశర్మ సుమారు 5.5 అడుగుల ఎత్తు, ఛామనఛాయ రంగులో బట్టతల కలిగి ఉంటాడని, ఆచూకీ తెలిసిన వారు 0883 2421133 నెంబరుకు లేదా దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు.

వీరవరంలో కూటమి ఆత్మీయ సమావేశం


వీరవరంలో టీడీపీ-జనసేన-బీజేపీ సమావేశం

కడియం, ఏప్రిల్ 7: మండలంలోని వీరవరంలో జనసేన నాయకుడు ఆదిమూలం సాయిబాబా ఇంటి వద్ద ఆదివారం టీడీపీ-జనసేన-బీజేపీ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి పార్టీ శ్రేణులతో పలు అంశాలు మాట్లాడారు. కార్యక్రమంలో మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి ప్రసాద్, ఆదిమూలం సాయిబాబా, వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, గట్టి సుబ్బారావు, పంతం గణపతి, గట్టి నర్సయ్య, పాటంశెట్టి రామ్‌జీ పలువురు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు కూటమి ఆత్మీయ సమావేశం

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగిశెట్టి చంటిబాబు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 7: టీడీపీ-జనసేన-బీజేపీ శ్రేణుల నియోజకవర్గం ఆత్మీయ సమావేశం సోమవారం కోరుకొండ మండలం బూరుగుపూడిలోని ద్వారకామయి ఫంక్షన్‌హాల్‌లో జరుగుతుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగిశెట్టి చంటిబాబు తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆ రోజు మధ్యాహ్నం 2గంటలకు జరిగే ఈ సమావేశానికి రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్యఅతిథిగా, రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ ప్రత్యేక అతిథిగా విచ్చేస్తారని చెప్పారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని చంటిబాబు కోరారు. కాగా టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి ఆదేశాల మేరకు తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశాలు మండలంలోని అన్ని గ్రామాల్లో పూర్తయ్యాయని చెప్పారు.

రంగంపేటలో చలివేంద్రం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్పీటీసీ రాంబాబు

రంగంపేట, ఏప్రిల్ 7: రంగంపేటలోని సినిమాహాల్ సెంటర్లో బైబిల్‌మిషన్ ఆధ్వర్యంలో కుసుమంచి కృష్ణంరాజు దంపతులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని జడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు ఆదివారం ప్రారంభించి మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. బాటసారులకు, వాహనదారులకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. 14 ఏళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న కృష్ణంరాజు దంపతులను అభినందించారు. కార్యక్రమంలో కొల్లాటి ఇశ్రాయేలు, ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, పోతుల బులివీర్రాజు, గారపాటి వెంకటరావు, మేడిశెట్టి రవిశంకర్ పాల్గొన్నారు.

వీధిబడి కవితకు పురస్కారం



కడియం, ఏప్రిల్ 7: కడియం గ్రామానికి చెందిన కవి చిలుకూరి శ్రీనివాసరావు రచించిన వీధిబడి కవితకు ఉత్తమ పురస్కారం లభించింది. ఉగాది సందర్భంగా ఆదివారం కొత్తపేట కళా సాహితీ ఆధ్వర్యంలో కవితా సమ్మేళనం జరిగింది. దీనిలో శ్రీనివాసరావు ఆలపించిన వీధిబడి కవితకు ఉత్తమ బహుమతి లభించింది. కళాసాహితీ అధ్యక్షుడు పెనుమత్స హరిహర దేవళ రాజు, ప్రధాన కార్యదర్శి గిడ్డు సుబ్బారావు, ప్రొఫెసర్ టీఎస్ సత్య నారాయణ, కవి జోస్యుల కృష్ణబాబు చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ది ఫ్యామిలీ స్టార్
సూర్యామినీ	: గాడ్జిల్లా అండ్ కాంగ్
సూర్యాప్యాలస్	: మంజుమ్మల్ బాయ్స్
స్వామి	: ది ఫ్యామిలీ స్టార్
శివజ్యోతి	: ది ఫ్యామిలీ స్టార్
అనుశ్రీ(సాయికృష్ణ)	: మంజుమ్మల్ బాయ్స్
రాజా	: ది ఫ్యామిలీ స్టార్
ఊర్వశి	: ఓం భీం బుష్
రంభ	: గాడ్జిల్లా అండ్ కాంగ్
మేనక	: భరతనాట్యం
అప్సర	: టిల్లు స్క్వేర్
కుమారి	: టిల్లు స్క్వేర్
వీఎస్ మహల్(నామవరం)	: ది ఫ్యామిలీ స్టార్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: ది ఫ్యామిలీ స్టార్
వెంకటసూర్య(కడియం)	: ది ఫ్యామిలీ స్టార్
సత్యగౌరి (అనపర్తి)	: ది ఫ్యామిలీ స్టార్
సూర్యశ్రీ (అనపర్తి)	: టిల్లు స్క్వేర్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: టిల్లు స్క్వేర్
రామకృష్ణ(కోరుకొండ)	: టిల్లు స్క్వేర్
గీతాసినిమాస్ (సీతానగరం)	: ది ఫ్యామిలీ స్టార్
శ్రీనివాస (గోకవరం)	: టిల్లు స్క్వేర్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ది ఫ్యామిలీ స్టార్
లలితామహల్(రంపచోడవరం)	: ది ఫ్యామిలీ స్టార్
నవయుగ(చింతూరు)	: ది ఫ్యామిలీ స్టార్




రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమ) సా. 6.26
సహరి(మంగళ) ఉ. 4.28


ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	45.0	24.0

10న నిడదవోలులో చంద్రబాబు, పవన్ రోడ్‌షో

తొలిసారి జిల్లాలో ఉమ్మడిగా పర్యటన





రాజమహేంద్రవరం, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉమ్మడిగా రోడ్ షో నిర్వహించనున్నారు. ఇప్పటి వరకూ ఒకే వేదికపై ఇద్దరూ కనిపించారు. రోడ్‌షో మాత్రం ఇప్పటి వరకూ నిర్వహించలేదు. తూర్పుగోదావరి జిల్లాలో తొలిసారి ఒకే రోడ్ షోలో చంద్రబాబు, పవన్ కనిపించనున్నారు. నిడదవోలులో ఈ నెల 10న రోడ్ షో, బహిరంగ సభ నిర్వహించనున్నారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు తణుకులో రోడ్ షో నిర్వహిస్తారు. అనంతరం రోడ్ మార్గాన సాయంత్రం ఏడు గంటలకు నిడదవోలులో రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో నిడదవోలు కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్,టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరు గుపల్లి శేషారావు ఏర్పాట్లు చేస్తున్నారు.11వ తేదీన పి.గన్నవరం, అమలాపురం నియోజకవర్గాల్లో ఉమ్మడిగా రోడ్‌షో,సభ ఉంటుందని సమాచారం.

తవ్వారు.. వదిలేశారు..!

- రాజమహేంద్రవరంలో రోడ్లు మిల్లింగ్
- నరకం చూస్తున్న జనం
- ఛిద్రంగా మారి నగర వీధులు
- తారు కొరతా...డబ్బులేదా?





(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో అధికార వైసీపీ ప్రజలకు నరకం చూపిస్తోంది. ఐదేళ్ల పాటు కనీసం రోడ్లను పట్టించుకోని నగరపాలక సంస్థ ఎన్నికల ముందు ఆదరా బాదరాగా సీసీ రోడ్లు వేస్తామని చెప్పి చాలా రోడ్లను మిల్లింగ్ చేసింది. అంటే పైభాగం గోకేసి వదిలేసింది. దీంతో ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రోడ్లు నిర్మించే ముందు ఎప్పటి పని అప్పుడే చేసేవారు. ప్రస్తుతం నెలల తరబడి రోడ్లను తవ్వేసి వదిలేశారు. తారు కొరత ఏర్పడిందని చెబుతున్నారు. దానవాయిపేటలోని ప్రధాన రోడ్డు తవ్వేసి చాలా రోజులైంది. ఇటీవల ఒక మూల నుంచి సీసీ రోడ్డు మొదలు పెట్టారు. కానీ ఈ రోడ్డును చూస్తుంటే రాజమహేంద్రవరమేనా, అందులోనూ దానవాయిపేట ప్రధాన రోడ్డేనా అనిపిస్తోంది. ఏవీ అప్పారావు రోడ్డును కిలోమీటర్ల మేర తవ్వేసి చాలా రోజులైంది.దానిని ఎవరూ పట్టించుకోవడంలేదు. స్వతంత్ర ఆసుపత్రి సమీపంలోని వాంబేగృహాల రోడ్డు మరీ అధ్వానం. ఎన్నికల ముందు రోడ్లు వేసి ప్రజల మన్నన పొందాలనే వైసీపీ ఆతృత కారణంగా ప్రజలు నరకం అనుభవిస్తున్నా రు. మునిసిపల్ అధికారుల ఈ రోడ్ల గురించి పూర్తిగా చెప్పడానికి ఇబ్బంది పడుతున్నారు. ఎందుకంటే చాలా రోడ్లు నిధులు లేకుండానే తవ్వేశారు. కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో పనులు ఆపేశారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల ప్రభుత్వం పాత బకాయిలు రూ.18 కోట్లు రిలీజ్ చేసినట్టు చెబుతున్నారు. అవి తీసుకున్నా ప్రస్తుత రోడ్లకు కాంట్రాక్టర్లు పెట్టుబడులు పెట్టవలసి ఉంది. మార్చి 31వతేదీ దాటడం, కొత్త ఆర్థిక సంవత్సరం ఆరంభమవడంతో పనులు ఏ మేరకు ఈ ఎన్నికల సమయంలో పూర్తవుతాయోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తవ్వకపోయినా బాగుండేది. ఏకంగా తవ్వి వదిలేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

15న ఎన్నికల విధులపై శిక్షణ

జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 7 : జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులందరికి ఈ నెల 15న నియోజకవర్గాల వారీగా శిక్షణ ఇస్తామని జిల్లా ఎన్నికల అధికారిణి డాక్టర్ కే.మాధవీలత తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు ఉత్తర్వులతో పాటు ముందస్తుగా ఫారం 12 జారీచేసినట్లు తెలిపారు. ఫారం 12లో తప్పులు సరిదిద్దేందుకు నమూనా ఫారం 12 ఆయా శాఖల హెచ్‌వోడీలకి /డీడీవోలకి పంపడం జరిగిందన్నారు. వీటిని ఎన్నికల కమిషన్ వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. 15న జరిగే శిక్షణలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు. ఫేసిలిటేషన్ సెంటర్‌లో 10 టేబుల్స్ ఏర్పాటు చేసి డేటా ఎంట్రీ ఆపరేటర్లను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. వారి వద్దకు మీ డ్యూటీ ఉత్తర్వులు ఫారం 12, ఎపిక్ కార్డు తీసుకుని వెళ్లి మీ ఓటు నిర్ధారణ చేసుకోవాలని తెలిపారు. ఓటర్లకు తమ ఓటు ఉందా ? లేదా ? ఉంటే ఏ పోలీంగ్ స్టేషన్‌లో ఉంది, ఎక్కడ ఉంది అనే సమాచారంతో పాటు బూత్ లెవెల్ అధికారి ఎవరు ఫొటోగుర్తింపు కార్డు అవసరమైన సమాచారం పబ్లిక్ పోర్టల్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



9 అంశాలతో మేనిఫెస్టో పోస్టర్ విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆ రెండు టిక్కెట్లు మార్చండి

- కొవ్వూరు, అనపర్తి అభ్యర్థులను మార్చాలని డిమాండ్
- జిల్లా కాంగ్రెస్ సమావేశంలో నిలదీసిన నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 7 : కాంగ్రెస్ పార్టీలో విభేదాలు రచ్చకెక్కాయి. రాజమహేంద్రవరం ఆనంద్ రీజెన్సీలో జిల్లా పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల మండల కన్వీనర్లు ,ముఖ్యనాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు.ఏఐసీసీ రాష్ట్ర పరిశీలకుడు మనోజ్ చౌహాన్, ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు దిశా నిర్దేశం చేశారు. అనంతరం పోటీ చేస్తున్న అభ్యర్థులతో కలిసి 9 గ్యారెంటీల పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో కొవ్వూరు నియోజకవర్గానికి చెందిన నాయకులు జె.రవికుమార్, భాస్కర్, మట్టా సుబ్బారావు, కొడమంచిలి చంద్రశేఖర్ కొవ్వూరు అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేశారు. నేతలతో వాగ్వాదానాకి దిగారు. కార్యకర్తలకు అందుబాటులో లేకుండా కేవలం ఎన్నికల్లో మాత్రమే వచ్చే వారికి సీటు ఎలా కేటాయిస్తారని నిలదీశారు. పార్టీ జెండా పట్టుకుని ప్రతి కార్యక్రమంలో కష్టపడి పనిచేసిన వారిని పక్కనపెట్టడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అనపర్తి నియోజకవర్గానికి చెందిన రాజారెడ్డి తాను పార్టీ కోసం కష్టపడ్డానని.. అనపర్తి నియోజకవర్గాన్ని అన్ని పార్టీలు రెడ్లకు కేటాయిస్తే కాంగ్రెస్ మాత్రం తనకు అన్యాయం చేసిందని అభ్యర్థిని మార్పుచేయాలని డిమాండ్ చేశారు. సీతానగరం గ్రామానికి చెందిన సూర్యకుమారి తాను పార్టీ కోసం కట్టపడ్డానని ఒక ఓసి మహిళకు సీటు కేటాయించలేకపోయారని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో సమావేశంలో గందరగోళం నెలకొంది. గిడుగు రుద్రరాజు వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయితే వారిలో కొందరు అక్కడ నుంచి వెళ్లిపోయారు. మరికొందరు నాయకులు చెప్పే మాటలు విని శాంతించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లు సుంకర పద్మశ్రీ, జంగా గౌతమ్, అసెంబ్లీ అభ్యర్థులు బోడా వెంకట్, బాలేపల్లి మురళీధర్,డాక్టర్ యళ్ళ శ్రీనివాసరావు, ఎం.వెంకటశ్రీనివాస్, అరిగెల అరుణకుమారి, పెదిరెడ్డి సుబ్బారావు, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ముళ్ళ మాధవ్, ఆకుల సూర్యభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఓటు పాఠం చెబుతాం వినండి..

కడియంలో డీఈవో, టీచర్ల అవగాహన ర్యాలీ

కడియం, ఏప్రిల్ 7: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు పిలుపునిచ్చారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం కడియం ఎంఆర్‌సీ నుంచి దేవీచౌక్ సెంటర్ వరకు ఓటర్ల అవగాహన ర్యాలీ చేశారు. ఓటు పాఠం చెబుతాం వినండి అంటూ నినాదాలు చేశారు. బొబ్బిలిబ్రిడ్జి సెంటర్‌లో మానవహారం నిర్వహించి ఓటు విలువ తెలిపారు.డీఈవో వాసుదేవరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం అన్నారు.ఓటు ద్వారా ప్రజాస్వామ్యం బలపడుతుందన్నారు. కడియం ఎంఈవో-1,2 మణికుమార్, వై.నాగేశ్వరరావు, హెచ్‌ఎం టి.సత్యనారాయణ, ఈవీఎస్‌ఆర్ ప్రసాద్, విశ్వనాథం, యూటీఎఫ్,ఎస్‌టీయూ నాయకులు అబ్బాయి,ఆనందవిజయకుమార్, వల్లూరి శ్రీనివాసరావు, టీవీఎస్ ప్రసాద్,సబ్బితి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగదుకు పత్రం అందజేస్తున్న సిబ్బంది

రూ.3.36 లక్షల నగదు స్వాధీనం

రంగంపేట, ఏప్రిల్ 7 : రామేశంపేట చెక్‌పోస్ట్ వద్ద సరియైన ఆధారాలు లేని నగదు స్వాధీనం చేసుకున్నారు. రామేశంపేట చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం మధ్యాహ్నం 12.40 గంటలకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ వాహన తనిఖీలు చేస్తున్నారు. కాకినాడ నుంచి రాజమహేంద్రవరం వైపునకు వెళుతున్న ఇన్నోవా వాహనంలో తనిఖీ చేయగా ఆధారాలు లేని రూ. 3,36,500ల నగదు లభ్యమైంది. ఈ మేరకు సొమ్మును స్వాధీనం చేసుకున్నట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ పి.వెంకటరత్నం తెలిపారు. రంగంపేట ఎస్‌ఐ ద్వారా జిల్లా ఎన్నికల గ్రీవెన్స్‌సెల్‌కు తరలించడానికి చర్యలు తీసుకున్నామన్నారు.తనిఖీల్లో చెక్‌పోస్ట్ సిబ్బంది కె.వీర్రాజు,కె.ఆదినారాయణ, జి.వెంకటలక్ష్మి, ఫ్లయింగ్‌స్క్వాడ్ జీవీఎస్ఎస్ రెడ్డి,వీఆర్వో దొరబాబు పాల్గొన్నారు.

ఓటు రూటు..

నిండు వేసవిలో వేడెక్కిన రాజకీయం



- జనం బాట పట్టిన నాయకులు
- హోరెత్తుతున్న ప్రచారం
- కూటమి అభ్యర్థుల జోరు
- రంగంలోకి కుటుంబీకులు
- ప్రజల నుంచి విశేష స్పందన
- వైసీపీకి కార్యకర్తలు దూరం
- వలంటీర్లతో నెట్టుకొస్తున్న వైనం
- మరో 10 రోజుల్లో నోటిఫికేషన్



బిక్కవోలు మండలం కొంకుదురులో న్యాయం కోసం నల్లమిల్లి యాత్రలో మూలారెడ్డి చిత్రపటానికి హారతి పడుతున్న మహిళ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రాజకీయం వేడెక్కింది.ప్రధాన పార్టీలన్నీ తమ అభ్యర్థులను ఖరారు చేయడంతో ప్రచారం జోరందుకుంది. జిల్లాలో ఈసారి ఎన్నికలు రసవత్తరంగా సాగనున్నాయి. ఎందుకంటే ఎప్పుడెప్పుడంటూ ఎన్నికల తేదీ కోసం ఎదురుచూస్తున్నారు.ఎవరి నోట విన్నా ప్రజావ్యతిరేక వైసీపీ విధానాలపై విరుచుకుపడుతున్నారు. ఇంత వరకూ జరిగిన ఎన్నికలు వేరు. ఈసారి జరిగే ఎన్నికలు వేరు అన్నట్టు విధానాలు మారిపోయాయి. 2019 సాధారణ ఎన్నికల వరకూ ఎవరైనా పోటీ చేయవచ్చు. ఎవరైనా ప్రచారం చేసుకోవచ్చు.ఎవరైనా నెగ్గవచ్చు అనే విధంగా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన స్థానిక ఎన్నికల ఎంత అప్రజాస్వామికంగా జరిగాయో అందరికీ తెలిసిందే. ప్రతిపక్షాలను నామినేషన్లు కూడా వేయనీయకుండా, పోటీకి ముందుకు రాకుండా కేసులు బనాయించడం,ప్రలోభాలు పెట్టడం వంటి అనేక అప్రజాస్వామిక విధానాలు కళ్లెదుటే కనిపించాయి. దీంతో చాలా చోట్ల ప్రతిపక్షాలు ఎన్నికల్లో పోటీచేయలేని పరిస్థితి ఏర్పడింది. పోరాడి స్థానిక ఎన్నికల్లో గెలిచినా అధికార వైసీపీని కాదని ఏమి చేస్తామనే ఉదాసీనత కూడా అప్పట్లో ఏర్పడింది.తర్వాత క్రమంగా పరిస్థితులు మారాయి. సొసైటీ, కొన్ని గ్రామ పంచాయతీల ఎన్నికలు నిర్వహించడానికి కూడా అధికార వైసీపీ భయపడిన సంగతి తెలిసిందే. దానికి రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎన్నికలే ఉదాహరణ. వార్డు రిజర్వేషన్లు ఖరారు చేసి, మేయర్ రిజర్వేషన్ కూడా ఖరారు చేసినా ఎన్నికలు జరగనీయలేదు. దానికి తోడు రూరల్ మండలంలోని సుమారు 11 గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేశారు. వాటికి ఎన్నికలు నిర్వహించలేదు. రాజానగరం, కోరుకొండ పరిధిలోని పలు పంచాయతీలను మొదట విలీనం చేసి తర్వాత ఆపే శారు. ఇదే కాకుండా ప్రభుత్వ విధానాలు ప్రజలకు నచ్చలేదు.ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలే త్వరగా ఎన్నికలు జరగాలని స్వచ్ఛందంగా కోరుకుంటున్నారు.

ఓట్లు చీలకూడదనే జట్టుగా..

ఒక్క ఓటు కూడా చీలకూడదనే ఉద్దేశంతో టీడీపీ-జనసేన- బీజేపీ పొత్తుపెట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ కూటమి చాలా బలీయంగా ఉంది. జిల్లాలో కూటమి అభ్యర్థులందరూ ఖరారయ్యారు. కూటమిగా జట్టు కట్టడం వల్ల కొందరు ఆశావహులకు సీట్లు దక్కలేదు. త్యాగాలు తప్పవని,వారందరికీ అధికారంలోకి రాగానే స్థాయికి తగ్గని విధంగా హోదా కల్పిస్తామని హామీలు ఇస్తూ, బుజ్జగిస్తూ పార్టీలు ముందుకు పోతున్నాయి. అనపర్తి టికెట్ మారడం వల్ల మొదటి జాబితాలోనే టికెట్ పొందిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి న్యాయం కోసం నల్లమిల్లి యాత్ర చేస్తున్నారు. తొలిజాబితాలో ఇచ్చిన పొత్తు నేపథ్యంలో అనపర్తి సీటును మార్చి బీజేపీకి ఇచ్చారు. ఈ సీటు విషయం కూడా తేలినట్టు సమాచారం. రేపోమాపో మళ్లీ రామకృష్ణారెడ్డికే సీటు దక్కే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా ఎన్నికల అధికారులు నిఘా పెంచారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు అనేక చోట్ల వాహనాలను తనిఖీ చేస్తున్నారు.ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ అవుతుంది. అప్పటి నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. 29తో నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుంది.మే 13న పోలింగ్. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో అంతా ప్రచారంపై దృష్టిపెట్టారు.

ప్రచారంలో ఎవరి దారి వారిదే..

జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానం ఉన్నాయి. ఇప్పటికే టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను ఖరారు చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ, రెండు జనసేన, పార్లమెంట్ పాటు ఒక అసెంబ్లీ స్థానంలో బీజేపీ తమ అభ్యర్థులను ఖరారు చేసింది. జిల్లాలో కూటమి అభ్యర్థులుగా రాజమహేంద్రవరం సిటీ ఆదిరెడ్డివాసు, గోపాలపురం మద్దిపాటి వెంకట్రాజు, రాజానగరం బత్తుల బలరామకృష్ణ, నిడదవోలు కందుల దుర్గేష్,రాజమహేంద్రవరం రూరల్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి. కొవ్వూరు ముప్పిడి వెంకటేశ్వరరావు పోటీలో ఉన్న సంగతి తెలిసిందే.అనపర్తి నుంచి బీజేపీ అభ్యర్థిగా ఎం. శివ కృష్ణంరాజు పేరు వినిపిస్తున్నా..ఈ పేరు మారే అవకా శం ఉంది.నల్లమిల్లికే మళ్లీ టిక్కెట్ ఇచ్చే సూచనలున్నాయి. వీరంతా ఇప్పటికే ఊరారా ప్రచారం మొదలు పెట్టారు. సామాజిక వర్గాల వారీ సమావేశాలు నిర్వహిస్తూ హామీలు ఇస్తున్నారు.కుటుంబీకులు తమ వారి కోసం తీవ్రంగా ప్రచారం చేస్తున్నారు. ప్రచారంలో గోరంట్ల స్టయిలే వేరుగా ఉంది. సుమారు 10 రోజుల పైపైనుంచే ఇంటింటా ఓటర్ల వివరాలు సర్వే చేయించి నట్టు సమాచారం. అక్కడ ఎన్ని ఓట్లు, కులం, తదితర వివరాలు సేకరించడంతో పాటు ప్రత్యేకంగా పార్టీ కార్యకర్తతో ప్రచారం చేయిస్తున్నారు. గోపాలపురంలో మద్దిపాటి మొదటి దఫా ఊళ్లలో పాదయాత్రలు చేస్తూ ప్రజలకు దగ్గరవుతున్నారు. కొవ్వూరులో ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రచారంలో దూసుకుపోతున్నారు. నిడదవోలు జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్‌తో కలిసి టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ప్రచారం చేస్తున్నారు. ఆదివారం దుర్గేష్ కుమార్తె ప్రియాంక రంగంలోకి దిగారు. రాజానగరంలో జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ కలసి ప్రచారం చేస్తున్నారు. అంతే కాకుండా బలరామకృష్ణ భార్య, కుమా ర్తెలు వేర్వేరుగా ప్రచారం చేస్తున్నారు. రాజమహేంద్రవరం సిటీలో ఆదిరెడ్డి వాసు,ఆదిరెడ్డి అప్పారావు వేర్వేరుగా ప్రచారం చేస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లో గోరంట్ల బుచ్చయ్యచౌదరి తరఫున ఆయన కుమార్తె శిరీష రంగంలోకి దిగారు. ఇక ఎంపీ అభ్యర్థిగా బలమైన నేత దగ్గుబాటి పురందేశ్వరి వచ్చిన సంగతి తెలిసిందే. గత మూడు రోజులుగా జిల్లాలో ప్రచారం చేస్తున్నారు. అంతే కాకుండా ఇటీవల చంద్రబాబు నాయుడు నిర్వహించిన ప్రజాగళం సభతో నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. వైసీపీ అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. కానీ పార్టీలో ఎవరి తీరు వారిదే అన్నట్టుగా ఉంది. ఒకరి ద్దరు తప్ప అందరూ పాత వాళ్లే కావడంతో వెన్ను పోట్లుకు సిద్ధమవుతున్నారు. పాలకులు ఐదేళ్ల కార్య కర్తలను పట్టించుకోకపోవడంతో ఇప్పుడు మేముందుకు చేయాలి అనే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో చాలా నియోజకవర్గాల్లో కార్యకర్తలు దూరంగా ఉంటున్నారు. ఇదిలా ఉండగా నాయకులు వారి స్థానాల్లో వలంటీర్లను రాజీనామా చేయించి మరీ ఎన్నికల రంగంలోకి దింపు తున్నారు. దీంతో కార్యకర్తలు ఒక్కొక్కరుగా దూరమైపోతు న్నారు. ఇక మా అవసరం ఏముందనే ధోరణిలో నాయకులు, కార్యకర్తలు ఉంటున్నారు. ప్రచారంలో కలిసి తిరిగినా అంటీముట్టనట్టుగానే ఉంటున్నారు.



రాజమహేంద్రవరంలో ప్రచారం చేస్తున్న ఆదిరెడ్డి వాసు, పురందేశ్వరి తనయుడు హితేష్



రాజమహేంద్రవరం రూరల్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి చిత్రంలో గోరంట్ల తదితరులు

కూటమిని గెలిపించండి

- ఫ్యాన్‌ని తిరగనీయకండి
- వైసీపీని గెలిపిస్తే ప్రమాదకరమే
- జగన్‌ను సాగనంపాలి
- కూటమికి అండగా ఉండాలి
- నేను రాజమండ్రి ప్రతిష్ఠ పెంచుతా..
- ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఓ తుఫాన్ వల్ల దివిసీమ కొట్టుకుపోయింది. హుద్‌హుద్ వల్ల విశాఖ దెబ్బతింది. ఇవి ప్రకృతి వైపరీత్యాలు. కానీ రాష్ట్రంలో ఇవాళ వాటికంటే ప్రమాదకరమైన విపరీత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దాలంటే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం కూటమి అభ్యర్థి దగ్గుబాటు పురందేశ్వరి అన్నారు. చెరుకూరి కల్యాణ మండపంలో ఆదివారం రాజమహేంద్రవరంలో ఆదివారం నిర్వహించిన రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు.ఫ్యాన్ ఇంట్లోనే ఉండాలంట.. 175 ఫ్యాన్‌లు తిరగాలంట..అయితే ఈ హోరుకు ఇళ్లలో ఎవరూ ఉండలేరు. అందుకే ఈ ఫ్యాన్‌గాలి బాగా తగ్గించాలని పిలుపునిచ్చారు.ఏ పార్టీ అయినా మొత్తం సీట్లలో పోటీ చేయాలనుకుంటుంది. కానీ రాష్ట్రంలో దుర్మార్గుడిని సాగనంపడానికి మూడు పార్టీలు కూటమిగా ఏర్పడడం వల్ల కొందరు త్యాగాలు చేయవలసి వచ్చిందన్నారు. వారికి బాధ ఉంటుంది కానీ పరిస్థితిని అర్థం చేసుకుని కూటమికి అండగా ఉండాలన్నారు. పార్లమెంట్‌లో నన్ను, సిటీలో ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ గోరంట్ల బుచ్చయ్య చౌదరితో పాటు మొత్తం కూటమి అభ్యర్థులందరినీ గెలిపించాలన్నారు. తమను ఆశీర్వదించాలని కోరారు. జగన్ ఓ మాఫియా అన్నారు. నాకు రాజమహేంద్రవరం భౌగోళిక పరిస్థితులు కూడా తెలియవని అంటున్నారు. నాకు తెలియకపోతే నేర్చుకుంటాను. ఆ తత్వం ఉంది.అంతేకాదు. చారిత్రక రాజమహేంద్రవరం ప్రతిష్ఠతను అతని మాదిరిగా దిగజార్చనని ఆమె ఘాటుగా కౌంటర్ వేశారు.సాంస్కృతిక కేంద్రమైన రాజమహేంద్రవరంలో తెలుగు విరజిల్లింది. రాజరాజనరేంద్రుడు, ఆదికవి నన్నయ్య,టంగుటూరి ప్రకాశంపంతులు, కందుకూరి వీరేశలింగం వంటి మహానుభావులు నడయాడిన నేల, నేను ఇక్కడ ప్రతిష్ఠ పెంచడానికి ప్రయత్నిస్తానని స్పష్టం చేశారు. రూరల్ అభ్యర్థి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ రాగద్వేషాలు లేకుండా అందరూ కలసి పనిచేయాలని, సైకో జగన్‌ను సాగనంపాలన్నారు. ఎన్టీఆర్ బిడ్డ పురందేశ్వరిని నాకంటే ఎక్కువ ఓట్లతో గెలిపించాలని, వచ్చే పుష్కరాలు నాటికి ఆమె ఇక్కడ అభివృద్ధి చేసి,మౌలిక సదుపాయాలు కల్పించి, పారిశ్రామిక రంగం అభివృద్ధికి బాటలు వేస్తారన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, కంఠంనేని శిరీష్, మత్స్యేటి ప్రసాద్, వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, ఆకుల శ్రీధర్, వీరా ప్రకాష్, ముద్రగడ, సీతారాం, నారాయణగౌడ్, మార్ని వాసు పాల్గొన్నారు.



నాడు విద్యార్థులు.. నేడు ప్రముఖ వైద్యులు

50 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు

రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 7 : నేటి విద్యార్థులే రేపటి పౌరులు.. ఎవరు ఎంత ఎత్తుకు ఎదురుతారో చెప్పడం కాస్త కష్టమే.. భవిష్యత్ నడిపిస్తుంది.. బావిభారత పౌరులుగా ఎదుగుతారు.. రాజమ హేంద్రవరం వీ.టీజూనియర్ కాలేజీలో 1972-74 బ్యాచ్ ఇంటర్మీడియెట్ బైపీసీ చదివిన పూర్వ విద్యార్థులే అందుకు ఉదాహరణ. 50 ఏళ్ల తర్వాత వాళ్ల సంగతేందుకంటారా.. ఎందుకంటే తాము ఇంటర్మీడియెట్ పూర్తి చేసి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నాటి విద్యార్థులంతా ప్రకాశ్‌నగర్ ధర్మంచర కమ్యూనిటీ హాలులో ఆదివారం కలుసుకున్నారు.. గోల్డెన్ జూబ్లీ వేడుకను ఆనందంగా జరుపుకున్నారు. ఎప్పుడూ బిజీగా ఉండే వారంతా ఒరేయ్ అరేయ్ అంటూ నాటి స్మృతులను గుర్తు చేసు కున్నారు. ఇంతకీ ఈ బ్యాచ్‌లో చాలా మంది వైద్యులుగా స్థిరపడ్డారు. డాక్టర్ దాట్ల భాస్కరరాజు,ప్రసాదరాజు ,డీఎస్ఎన్‌రాజు,రాపాక వీరభద్రస్వామి,కేదారి.ఎం.ఆదివిష్ణు తదితరులు ఉన్నారు. ప్రతి ఏటా ఇలాగే కలుసుకోవాలని నిర్ణయించారు.

9 గ్యారెంటీలతో ఏపీకి న్యాయం
కాంగ్రెస్ అబ్జర్వర్ మనోజ్ చౌహాన్
ఆన్‌లైన్ మందులతో చేటు
డ్రగ్స్ ట్రేడ్ సంఘ నాయకులు
6

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, ఏప్రిల్ 7: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ ఆలయంలో ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాతసేవ, ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు జరిపారు. అమ్మవారికి క్షీరనివేదన, మహానివేదన చేశారు. ప్రత్యేక అలంకరణలోఉన్న అమ్మవారిని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక దర్శనం, ప్రసాద విక్రయాలు, పూజా టికెట్లు విక్రయాలు, అన్నదాన విరాళాలు ద్వారా రూ. 1,02,053 ఆదాయం లభించినట్టు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మెన్ దేవులపల్లి రవిశంకర్, ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొవ్వూరు, ఏప్రిల్ 7: కొవ్వూరు 33/11 కేవీ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని టాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బి.వీరభద్రరావు తెలిపారు. ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు గౌతమీనగర్, ఫ్యాక్టరీ రోడ్, మెయిన్‌రోడ్, జూనియర్ కాలేజీ రోడ్డు, శ్రీనివాసపురం, క్రిస్టియన్‌పేట, రాజీవ్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

సుందరేశ్వరస్వామికి రుద్రాభిషేకం



సుందరేశ్వరుడికి అభిషేకాలు నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు, ఏప్రిల్ 7: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు విఘ్నేశ్వరపూజ, రుద్రాభిషేకం, అన్నాభిషేకం, భస్మాభిషేకం, బిల్వార్చన, రుద్రహోమం, అమ్మవారికి లక్ష కుంకుమ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు సంస్కృత పాఠశాలలోని గోష్పదేశ్వర స్వామి ఆలయంలో మాసశివరాత్రి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, ఏకవార రుద్రాభిషేకం, రుద్రహోమం, కుంకుమ పూజలు చేశారు. అష్టోత్తర శత జ్యోతిర్లింగార్చన నిర్వహించారు.

లిబరేషన్ కాంగ్రెస్ కొవ్వూరు అభ్యర్థిగా శ్యామ్



కొవ్వూరు, ఏప్రిల్ 7: లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థిగా కొవ్వూరుకు చెందిన బొంతా శ్యాం రవిప్రకాష్‌ను ఎంపిక చేశారు. దీంతో ఆయన పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని, పర్యాటకంగా తీర్చిదిద్దుతానని, రైల్వేస్టేషన్‌కు పూర్వ వైభవం తీసుకొస్తానని, బస్టాండ్‌కు అన్ని బస్సులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో సంపదను దోచుకుని ప్రజల సంక్షేమాన్ని మరిచారని, రిజర్వుడు నియోజకవర్గంలో ఎస్సీ హాస్టల్ విద్యార్థులను, దళితుల సమస్యలను పట్టించుకునే ప్రజాప్రతినిధులు లేరన్నారు. స్థానికుడిగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు.

ఆరోగ్య సేవలపై అవగాహన ర్యాలీ



ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన ర్యాలీ చేస్తున్న సిబ్బంది

నల్లజర్ల, ఏప్రిల్ 7: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం లక్ష్యం నెరవేర్చడంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యకర్తల కృషి, పట్టుదల ఎనలేనిదని ఏపీ వైద్య ఉద్యోగుల సంఘం నాయకుడు జీవీవీ ప్రసాద్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం నల్లజర్లలో ప్రజారోగ్యానికి ప్రభుత్వం అందిస్తున్న సేవలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా ఆరోగ్యం- నా హక్కు నినాదం నిజం చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ప్రజలతో మమేకమై, ఎప్పటికప్పుడు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ వారిలో చైతన్యం తీసుకొచ్చే విధంగా పలు రకాలైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

వృద్ధులకు చీరలు అందజేత

దేవరపల్లి, ఏప్రిల్ 7: మండలంలోని కృష్ణంపాలెంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వారోత్సవాల్లో భాగంగా గ్రామానికి చెందిన దొండపాటి లాజరస్ వృద్ధులకు చీరలు, పంచలు అందజేశారు. కార్యక్రమంలో బాబుజగ్జీవన్ రామ్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నాగేంద్ర



నియామకపత్రం అందుకుంటున్న నాగేంద్రబాబు

నిడదవోలు, ఏప్రిల్ 7: నిడదవోలుకు చెందిన తానింకి వెంకట నాగేంద్రబాబు కాంగ్రెస్‌పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతా పద్మశ్రీ, జిల్లా అధ్యక్షురాలు అరుణకుమారి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్రను రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, తానంకి వెంకటేశ్వరరావు, హీరాలాల్, బలరామ్, సత్యనారాయణ అభినందించారు.

బైక్‌లు ఢీకొని ఒకరికి గాయాలు

కొవ్వూరు, ఏప్రిల్ 7: రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలైనట్టు ఎస్ఐ జుబేర్ మహమ్మద్ తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లికి చెందిన పిల్లి వీర వెంకటేశ్వరరావు కుమారదేవం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. పని ముగించుకుని ఆదివారం ఉదయం బైక్‌పై ఇంటికి వస్తుండగా వాడపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న మోటారుసైకిల్ ఢీకొట్టింది. తీవ్ర గాయాల పాలైన అతడిని రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసునమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కూటమిని గెలిపించండి

రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 7: కూటమి అధికారంలోకి రావాలని టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి తనయుడు బీజేపీ నాయకుడు హితేష్ చెంచురామ్ అన్నారు. స్థానిక 22వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ మాటూరి రంగారావు, టీడీపీ నాయకులు శెట్టి జగదీష్, మాటూరి సిద్దు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓటు అనే ఆయుధంతో వైసీపీకి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డులోని రాయల్ మాస్క్ (పెద్దమసీదు)లో ముస్లింలకు గన్ని కృష్ణ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆదిరెడ్డి వాసు, దగ్గుబాటి హితేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ హాజరయ్యారు. రాజమహేంద్రవరం ఆర్యాపురం సత్యనారాయణ స్వామి ఆలయం సమీపంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వాసు మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా పనిచేస్తామని అందుకే తమ మేనిఫెస్టోలో ఆరోగ్యం రాజమండ్రి అంశాన్ని చేర్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో నగర టీడీపీ ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, ఎంఎస్ రావు, కొత్త రాజేష్, నిమ్మలపూడి గోవింద్, తక్కశాల పూర్ణ, నల్లం ఆనంద్, గ్రంధి రాజా, తమ్మన గోపాలకృష్ణ, లలిత్‌కుమార్ జైన్ పాల్గొన్నారు.

వీధిబడి కవితకు పురస్కారం

కడియం, ఏప్రిల్ 7: కడియం గ్రామానికి చెందిన కవి చిలుకూరి శ్రీనివాసరావు రచించిన వీధిబడి కవితకు ఉత్తమ పురస్కారం లభించింది. ఉగాది సందర్భంగా ఆదివారం కొత్తపేట కళాసాహితీ ఆధ్వర్యంలో కవితా సమ్మేళనం జరిగింది. దీనిలో శ్రీనివాసరావు ఆలపించిన వీధిబడి కవితకు ఉత్తమ బహుమతి లభించింది. కళాసాహితీ అధ్యక్షుడు పెనుమత్స హరిహర దేవళరాజు, ప్రధాన కార్యదర్శి గిద్దు సుబ్బారావు, ప్రొఫెసర్ టీఎస్ సత్యనారాయణ, కవి జోస్యుల కృష్ణబాబు నుంచి అవార్డు అందుకున్నారు.

కూటమి ప్రభుత్వంలో రూ.4 వేలు పెన్షన్

» సైకో ముఖ్యమంత్రి మోసపూరిత మాటలు నమ్మొద్దు
» టీడీపీ-జనసేన-బీజేపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి



తాళ్లపూడి: మలకపల్లిలో ప్రచారంలో పాల్గొన్న ముప్పిడి

తాళ్లపూడి, ఏప్రిల్ 7: తమ ప్రభుత్వం రాగానే రూ.4 వేల పెన్షన్ ఇంటికే పంపిస్తామని, సైకో సీఎం జగన్‌రెడ్డి లాగా కొద్దికొద్దిగా కాకుండా పూర్తిగా ఒక్కసారే పెంచి ఇస్తామని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని మలకపల్లి, రావూరుపాడులో ఆదివారం బాబు షూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన బీసీ కాలనీలో మాట్లాడుతూ సైకో ముఖ్యమంత్రి మోసపు మాటలు నమ్మొద్దని, వైసీపీ పాలనలో బీసీలకు పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు విజయం చేకూర్చి రాష్ట్రంలోని సైకో పాలన అంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు, మద్దిపాటి ప్రకాశం, మద్దిపాలి రామారావు, వీరాహరిబాబు, బోడపాటి గణపతి రాజు, కాకర్ల సత్యేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: కూటమి అభ్యర్థులు గెలుపొందాలని కోరుతూ మండలంలోని ధర్మవరంలో పలు చర్చిల్లో ముప్పిడి వెంకటేశ్వరరావు సతీమణి సుజాత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నా, పిల్లల భవిష్యత్ బాగుండాలన్నా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గారపాటి వెంకటకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిడదవోలులో క్రీడాభివృద్ధికి కృషి : దుర్గేష్

నిడదవోలు, ఏప్రిల్ 7: ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని జనసేన-టీడీపీ-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలులోని ప్రభుత్వ మహిళా కళాశాల గ్రౌండ్స్‌లో క్రీడాకారులతో మాట్లాడారు. క్రీడారంగానికి పెద్దపీట వేస్తామని, నియోజవర్గంలో అన్ని వసతులతో మినీస్టేడియం నిర్మిస్తామని చెప్పారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు విజయం చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ ప్రెసిడెంట్ రాజారామ్మోహనరాయ్, కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, కేఎస్ ప్రసాద్, నాని, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని నడిపల్లిలో కందుల దుర్గేష్ సోదరీమణులు స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు.



పెరవలి: కొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు పార్టీలోకి ఆహ్వానిస్తున్న దుర్గేష్



గోపాలపురం: జగన్నాథపురంలో రాజేశ్వరరావును టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మద్దిపాటి

ఇంటింటికీ వెళ్లి ఉమ్మడి మ్యానిఫెస్టోను వివరించారు. దుర్గేష్ విజయానికి కృషి చేయాలన్నారు. ఇదిలా ఉండగా వైసీపీ నుంచి కొత్తపల్లి అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు కందుల దుర్గేష్, జనసేన ఇన్‌చార్జి భోగవల్లి ప్రసాద్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ప్రస్తుత ప్రభుత్వ అరాచక విధానాలతో విసిగిపోయిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు జనసేన, టీడీపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో పిప్పర రవి, సలాది కృష్ణమూర్తి, సలాది శ్రీహరి పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని సూర్యారావుపాలెంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజవర్గ అభ్యర్థి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రస్తుత పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. శేషారావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, నందిన శ్రీనివాస్, మద్దుకూరి శ్రీమన్నారాయణ, వేమన శ్రీనివాస్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చివటం గ్రామంలో దుర్గేష్ కుమార్తె ప్రియాంక, సోదరి అన్నపూర్ణ ఇంటింటా ప్రచారం చేశారు. దుర్గేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, ముళ్లపూడి పాండురంగ, కుడప రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపుతో గోపాలపురంలో మార్పు : మద్దిపాటి

గోపాలపురం, ఏప్రిల్ 7: కూటమి అభ్యర్థుల గెలుపుతో గోపాలపురం నియోజకవర్గ భౌగోళిక స్వరూపం మారుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. గ్రామంలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మాదేపల్లి రాజేశ్వరరావు, యర్రమళ్ళ కృష్ణ, కొయ్యల మూడి వీర్రాజు, చింతాటి ఆంజనేయులు, మాదేపల్లి నరసింహమూర్తి, కొండ పల్లి గిరి తదితరులు టీడీపీలో చేరారు. వారికి మద్దిపాటి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైకోపాలనకు చరమగీతం పాడి సైకిల్ ఎక్కేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కూటమి రాష్ట్రంలో విజయ ఢంకా మోగించడం ఖాయమన్నారు. మూడు పార్టీల నాయకులు సమన్వయం చేసుకుని ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మమేకం కావాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందరేశ్వరి గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, పసుమర్తి రమేష్, కాట్రగడ్డ సురేష్, పోడూరి రఘురామ్, పసుమర్తి పెద్దబ్బులు, పోసిన గణపతి, రమేష్, కొర్లపాటి రాము, నూతంగి దొరబాబు తదితరులు పాల్గొన్నారు. పెద్దగూడెంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన వలంటీరు నక్కా నాగేశ్వరి కుటుంబాన్ని మద్దిపాటి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె కుమార్తె హనీ చదువు నిమిత్తం రూ.25 వేలు డిపాజిట్ చేశారు.

రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుకబాటు : అచ్చిబాబు



కుమారదేవం సభలో మాట్లాడుతున్న అచ్చిబాబు

కొవ్వూరు, ఏప్రిల్ 7 : వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుకబడిందని టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) అన్నారు. కొవ్వూరు మండలం ఆరికిరేవుల, కుమారదేవం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన టీడీపీ-జనసేన-బీజేపీ నాయకుల సమన్వయ సమావేశాలకు ఆయన విచ్చేసి మాట్లాడారు. చంద్రబాబు దూరదృష్టితో ఈ రోజు పిల్లలంతా ఉన్నత విద్యనభ్యసించి విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ఒక్కచాన్స్ పేరుతో జగన్మోహనరెడ్డికి ఓటువేసి గెలిపిస్తే ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీ అమలు పర్చలేదన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా చేశారని, అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన రైతులపై అక్రమకేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారన్నారు. ప్రజలంతా ఆలోచించి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండ లాధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, గుత్తా రమణ, చావా శ్రీనివాసరావు, గొరిజాల సురేష్, జనసేన మండలాధ్యక్షుడు సుంకర సత్తిబాబు, సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, మారిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

9 గ్యారెంటీలతో ఏపీకి న్యాయం

ఏఐసీసీ అబ్జర్వర్ చౌహాన్, ఎంపీ అభ్యర్థి గిడుగు



ఐక్యతా అభివాదం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 7: ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ 9 గ్యారెంటీలతో న్యాయం చేస్తుందని ఏఐసీసీ రాష్ట్ర పరిశీలకుడు మనోజ్ చౌహాన్ అన్నారు. రాజమహేంద్రవరం హోటల్ ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రధాని మోదీ, అమిత్ షాలను ఎదుర్కొనే ఏకైక నాయకుడు రాహుల్‌గాంధీ అని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజలందరిజూలీ కాంగ్రెస్ నాయకులు కలవాలని, రాష్ట్రానికి జరిగిన అన్యాయం, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు వివరించాలన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీ ప్రత్యేక హోదాను తీసుకురాలేపోయిందన్నారు. రాష్ట్రానికి న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ అన్నారు. రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాజకీయ వారసులం తామేనని, జగన్ కేవలం వైఎస్ఆర్ ఆస్తికి మాత్రమే వారసుడని స్పష్టం చేశారు. దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లు సుంకర పద్మశ్రీ, జంగా గౌతమ్, ఎస్ఎన్ రాజా, రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి బోడా వెంకట్, రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళీదర్, అనపర్తి అభ్యర్థి డాక్టర్ యళ్ల శ్రీనివాసరావు, రాజానగరం అభ్యర్థి ఎం.వెంకటశ్రీనివాస్, కొవ్వూరు అభ్యర్థి అరిగెల అరుణకుమారి, నిడదవోలు అభ్యర్థి పెదిరెడ్డి సుబ్బారావు, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి శ్రీనివాస్, సీపీఐ నుంచి కొండలరావు, సీపీఐ కార్యదర్శి ముళ్ళ మాధవ్, మార్టిన్ లూథర్, ఆకుల సూర్య భాగ్యలక్ష్మీ, కృష్ణా జిల్లా నాయకులు సంజీవరెడ్డి, కొత్తూరి శ్రీను, మట్టాప్రసాద్, కాటం రవి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మందులతో చేటు

» డ్రగ్స్ ట్రేడ్ అసోసియేషన్.. నూతన ప్యానెల్ ప్రమాణ స్వీకారం



ఎంపీ భరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న డ్రగ్స్ అసోసియేషన్ నాయకులు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మందుల విక్రయాల వల్ల ప్రజలకు తీవ్రంగా చేటు కలుగుతోందని జిల్లా డ్రగ్స్ ట్రేడ్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రాయపూడి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా స్థాయి నూతన ప్యానెల్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని జాతీయ స్థాయి డ్రగ్స్ ట్రేడ్ అసోసియేషన్ ప్రతినిధుల సమక్షంలో ఆదివారం నిర్వహించారు. ఆన్‌లైన్ మందుల విక్రయాల వల్ల మత్తు మందుల వినియోగం విపరీతంగా పెరిగిందన్నారు. జాతీయ స్థాయి డ్రగ్స్ ట్రేడ్ అసోసియేషన్ సహకారంతో వాటిని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ప్రమాణ స్వీకారోత్సవానికి విచ్చేసిన ఎంపీ భరత్‌రామ్‌కి మందుల షాపులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇండియన్ ఫార్మాస్యూటికల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ, సద్గా రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రత్నం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి పిండి గణపతి, కోశాధికారి కె.శ్రీనివాసరావు, వినాయక్, పిల్లా బాల, ఎక్కల వీర నాగేశ్వరరావు, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మన చేతిలోనే..మన ఆరోగ్యం

» డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్



వృద్ధులకు పండ్లు అందజేస్తున్న హిప్నో పద్మకమలాకర్

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 7: మన జీవితంలో ఆరోగ్యాన్ని పొందే మార్గం మన చేతుల్లోనే ఉంటుందని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్-ఇండియా అధ్యక్షురాలు డా.హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో కస్తూర్బా ఆశ్రమంలో ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఆరోగ్య సేవలు, విద్య, సమాచారం పొందడం ప్రతిఒక్కరి హక్కు అన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వి.హేమకుమారి, తణుకు సైకాలజిస్ట్ పి.రమేష్‌కుమార్ మాట్లాడుతూ మన ఆరోగ్యానికి నవ్వు ఒక దివ్యౌషధం వంటిదన్నారు. అది మన ఆనందాన్ని, ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. వైద్య సంఘం సభ్యులు విక్రమహాలులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నా ఆరోగ్యం- నా హక్కు నినాదం గురించి వివరించారు. యోగా గురువుతీడా రాము సాయినగర్ ఫ్లోరా పార్కులో ఉచిత యోగా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరం ఈ నెల 18వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. వివరాలకు 98666 16222నెంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సచ్చిన శ్రీనివాసరావు, ఆకాశం గౌరీష్‌బాబు, లొల్ల రామచంద్రరావు, జి.బుల్లియ్య, నామాల శ్రీనివాసరావు, శెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

2020లో అదృశ్యం.. నేటికీ ఆచూకీ లేదు

ఆవేదనలో వృద్ధుడి కుటుంబీకులు



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వృద్ధుడి అదృశ్యంపై మూడున్నరేళ్లుగా చిక్కుముడి వీడడం లేదు. దీంతో అసలు ఆయన ప్రాణాలతో ఉన్నారా? అని కుటుంబీకులు ఆవేదన చెందుతున్నారు. రెండో పట్టణ ఏఎస్ఐ పీవీ రమణమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన కుప్పా తమ్మేశ్వర శర్మ(70) దైవ చింతనతో రైల్వే స్టేషను సమీపంలోని వెంకట రామ అచల ఆశ్రమంలో ఉండేవారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న తన కుమారుడిని చూసి వస్తానని ఆశ్రమ వాసులతో చెప్పి 2020 అక్టోబరు 24న వెళ్లాడు. ఈలోగా తండ్రిని చూడడానికి కుమారుడు కుప్పా విశ్వనాథం హైదరాబాద్ నుంచి ఆశ్రమానికి వచ్చారు. ఆయన మీ వద్దకే హైదరాబాద్ వచ్చారని కుమారుడితో ఆశ్రమ వాసులు చెప్పారు. అయితే తండ్రి హైదరాబాద్ చేరకపోవడంతో విశ్వనాథం ఆందోళన చెందారు. పలు ప్రాంతాల్లో ఆరా తీసినా ఫలితం లేక రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. మూడున్న రేళ్లు గడిచినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. తమ్మేశ్వరశర్మ సుమారు 5.5 అడుగుల ఎత్తు, ఛామనఛాయ రంగులో బట్టతల కలిగి ఉంటాడని, ఆచూకీ తెలిసిన వారు 0883 2421133 నెంబరుకు లేదా దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు.

వీరవరంలో కూటమి సమావేశం



కడియం, ఏప్రిల్ 7: మండలంలోని వీరవరంలో జనసేన నాయకుడు ఆదిమూలం సాయిబాబా ఇంటి వద్ద ఆదివారం టీడీపీ-జనసేన-బీజేపీ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి పార్టీ శ్రేణులతో పలు అంశాలు మాట్లాడారు. కార్యక్రమంలో మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి ప్రసాద్, ఆదిమూలం సాయిబాబా, వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, గట్టి సుబ్బారావు, పంతం గణపతి, గట్టి నర్సయ్య, పాటంశెట్టి రామ్‌జీ పలువురు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు కూటమి ఆత్మీయ సమావేశం

దివాన్‌చెరువు, ఏప్రిల్ 7: టీడీపీ-జనసేన-బీజేపీ శ్రేణుల నియోజకవర్గం ఆత్మీయ సమావేశం సోమవారం కోరుకొండ మండలం బూరుగుపూడిలోని ద్వారకామయి ఫంక్షన్‌హాల్‌లో జరుగుతుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగిశెట్టి చంటిబాబు తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆ రోజు మధ్యాహ్నం 2గంటలకు జరిగే ఈ సమావేశానికి రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్యఅతిథిగా, రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ ప్రత్యేక అతిథిగా విచ్చేస్తారని చెప్పారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని చంటిబాబు కోరారు. కాగా టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి ఆదేశాల మేరకు తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశాలు మండలంలోని అన్ని గ్రామాల్లో పూర్తయ్యాయని చెప్పారు.

రంగంపేటలో చలివేంద్రం

రంగంపేట, ఏప్రిల్ 7: రంగంపేటలోని సినిమాహాల్ సెంటర్లో బైబిల్‌మిషన్ ఆధ్వర్యంలో కుసుమంచి కృష్ణంరాజు దంపతులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని జడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు ఆదివారం ప్రారంభించి మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. బాటసారులకు, వాహనదారులకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. 14 ఏళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న కృష్ణంరాజు దంపతులను అభినందించారు.

నేడు నూకాలమ్మ తీర్థం

రాజానగరం, ఏప్రిల్ 7: రాజానగరంలోని శ్రీనూకాలమ్మ తీర్థ మహోత్సవాన్ని ఈ నెల 8న నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారి జాతరను బాణసంచా కాల్పులు నడుమ వైభవంగా ప్రారంభించారు. సోమవారం తీర్థం నిర్వహించనున్నారు. గ్రామానికి చెందిన ముచ్చకర్ల మూలయ్య, జగ్గాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అమ్మవారికి రూ.3.70 లక్షలు విలువైన బంగారు మంగళ సూత్రాలు, వెండి కంఠాభరణం, వెండి కిరీటం బహూకరించారు. తీర్థం సందర్భంగా అమ్మవారి ప్రతిరూపంగా భావించే తాటి చెట్టుకు ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం చెట్టును ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసే ఊయలలో అమ్మవారి దర్శనం చేసుకున్న భక్తులు ఊయల ఊగడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కొంకుదురులో 'న్యాయం కోసం నల్లమిల్లి'



కొంకుదురులో కుటుంబ సభ్యులతో కలిసి పర్యటిస్తున్న నల్లమిల్లి

అనపర్తి, ఏప్రిల్ 7: తమ కుటుంబానికి టీడీపీతో 42 ఏళ్లుగా విడదీయలేని బంధం ఉందని, వేరే జెండాపై పోటీ చేయబోనని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా అనపర్తి అసెంబ్లీ సీటును కోల్పోయిన ఆయన చేపట్టిన న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమాన్ని ఆదివారం బిక్కవోలు మండలం కొంకుదురులో నిర్వహించారు. తన తల్లి సత్యవతి, సతీమణి మహాలక్ష్మి, తనయుడు మనోజ్‌రెడ్డి తనయ డాక్టర్ సనాతనితో కలిసి పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. కాగా కొంకుదురు రామకృష్ణారెడ్డి సతీమణి మహాలక్ష్మి స్వగ్రామం. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులు నల్లమిల్లి వెంట నడుస్తూ న్యాయం కావాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సత్తి దేవదానరెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, ఆళ్ల గోవిందు, సిరసపల్లి లక్ష్మి, ఒంటిమి గౌతమి, కర్రి సత్యవతి, సుభాషిణి, జుత్తుగ సూర్యకుమారి, చిన బుజ్జి పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	కింగ్ ఆఫ్ గాడ్జిల్లా
వై.స్క్రీన్2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	ఓం బీం బుష్
అనన్య	డీజే టిల్లు-2
నిడదవోలు	
వీ మ్యాక్స్	ప్రేమలు
రాధాకృష్ణ	భీమా
శ్రీగణపతి	ఓం బీం బుష్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి